అచల గురుమాతాజీ సమేత అచల గురూజీ
వారి అఖండ పరిపూర్ణ ఆశీస్సులతో



సత్య దీపిక ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : అమలాపురం | సంపుటి : 01 | సంచిక : 127 | శుక్రవారం 13-11-2026 | ఎడిటర్: ఎస్.ఎస్ రావు | పేజీలు : 04 | వెల : 3-00



చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు

- విశాఖ స్టీల్ సిటీ నుంచి సిలికాన్ సిటీగా రూపాంతరం
- ఓర్వకల్లు, పూడిమడకలో గ్రీన్ ఎనర్జీ కేంద్రాల అభివృద్ధి
- మేధోసంపత్తి హక్కులకు భారత్ పూర్తి గౌరవం
- తయారీ, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం

2లో

-కేంద్రమంత్రి పీయూష్ గోయల్

- భారత్--రష్యా వ్యూహాత్మక స్నేహబంధానికి పారిశ్రామిక భాగస్వామ్యంతో కొత్త బలం
- కీలక ఖనిజాలు, మెటలర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు
- అణుశక్తి, ఏఐ, పరిశోధన, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారం
- ఓడరేవులు, సముద్ర రవాణా, సరఫరా వ్యవస్థల అభివృద్ధిపై చర్చలు
- రష్యాలోని తతారిస్తాన్‌తో ప్రత్యక్ష పారిశ్రామిక అనుసంధానానికి ప్రాధాన్యం
- సంయుక్త పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాల విస్తరణకు కార్యాచరణ

రూ.632 కోట్లతో ఎత్తిపోతలపథకాల మరమ్మతులు

-కీలక ఖనిజాలు, అణుశక్తి, తయారీ, ఓడరేవులు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు

-పెట్టుబడిదారులకు వేగం, స్థిరత్వం, సేవే ప్రభుత్వ ప్రధాన భరోసా --రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్



విశాఖపట్నం,**సత్యదీపిక ఉదయం**

భారత్--రష్యా మధ్య చిరకాలంగా కొనసాగుతున్న వ్యూహాత్మక స్నేహబంధాన్ని ఆర్థిక, పారిశ్రామిక భాగస్వామ్యంగా మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్--రష్యా మధ్య ప్రాంతీయ భాగస్వామ్యాలను ప్రపంచ స్థాయి అవకాశాలుగా మలచేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా కాన్ఫరెన్స్ హాల్-3 హాల్ లో 'విశాఖ నుంచి కజాన్ వరకు.. ప్రాంతీయ భాగస్వామ్యాల నుంచి ప్రపంచ అవకాశాల దిశగా' అంశంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంత్రి నారా లోకేష్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా

మిగతా 2లో

స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



2లో

-శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత
-నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా తప్పనిసరి
-రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ రాజీనామా

- ఎన్విడియా సీఈవో పదవికి జెన్సన్ హువాంగ్ రాజీనామా
- బోర్డు సభ్యత్వం నుంచి కూడా వైదొలిగిన హువాంగ్
- తాత్కాలిక సీఈవోగా కొలెట్ క్రెస్ నియామకం
- వివాహేతర సంబంధాల ఆరోపణలతో ముదిరిన వివాదం



2లో

హైదరాబాద్ కొత్త సీపీగా మహేశ్ భగవత్ నియామకం



2లో

- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్‌కు బాధ్యతలు
- జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా నియామకం
- మహిళా భద్రత విభాగం డీజీగా సౌమ్య మిశ్రా
- ఏసీబీ డీజీగా చారు సిన్హాకు కీలక బాధ్యతలు
- పోలీస్ శాఖలో భారీ మార్పులు చేపట్టిన ప్రభుత్వం

మహిళల రాజకీయ, ఆర్థిక భాగస్వామ్యం మరింత పెరగాలి

-మహిళా సాధికారతకు ప్రత్యేక టెక్ పార్క్ -ఉచిత భూమి, ప్రోత్సాహకాలు
-ఉమెన్ అండ్ గ్రోత్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



2లో



2లో

మారుతున్న యుద్ధ తీరుకు అనుగుణంగా సైన్యం సిద్ధం కావాలి

- మారుతున్న యుద్ధ తీరుపై రాజ్‌నాథ్ ఆందోళన
- డ్రోన్లతో పెరుగుతున్న కొత్త ముప్పులు
- త్రివిధ దళాల రక్షణ సామర్థ్యాల పెంపునకు పిలుపు
- సైన్యానికి రక్షణ మంత్రి పిలుపు

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన ప్రాంతం



2లో

- పెట్టుబడులకు ఏపీ అనువైన, నమ్మకమైన గమ్యస్థానం
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం
- 1,053 కిలోమీటర్ల తీరప్రాంతం ఏపీకి ప్రధాన బలం
- కాకినాడ ప్రాంతీయ సదస్సులో 15 ఎంవోయూలు
- విశాఖ సీఐఐ సదస్సులో 150కి పైగా ఒప్పందాలే లక్ష్యం
- ఉపాధి కల్పనకు పారిశ్రామిక పెట్టుబడులతో ఊతం
- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న ఆంధ్రప్రదేశ్
- పారిశ్రామికవేత్తల కలలకు ప్రభుత్వ సహకారం
- మంచి ఆలోచనలకు అభివృద్ధి దిశగా ప్రోత్సాహం
- భవిష్యత్తు నిర్మాణంలో పెట్టుబడిదారులకు ఏపీ అండ
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు

జాతీయ స్థాయిలో పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలి
సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
303 ఒప్పందాలు.. రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు

- 25 రంగాలు.. ప్రత్యేక పారిశ్రామిక పార్కులు
- పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు
- పరిశ్రమలకు మెరుగైన లాజిస్టిక్స్ సదుపాయాలు
- పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు..
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు
- 303 ఒప్పందాలతో రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు
- జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ
- 714 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో భారీ పారిశ్రామిక విస్తరణ
- రూ.17.10 లక్షల కోట్ల విలువైన 526 ప్రాజెక్టులకు ఆమోదం
- రూ.7.30 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు నిర్మాణానికి సిద్ధం
- పెట్టుబడులను ఉత్పత్తి, ఉపాధి కల్పనగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం
- పరిశ్రమలకు భూమి, అనుమతులు, ప్రోత్సాహకాలు వేగంగా అందజేత
- కియా, అమ్మా, ఎల్జీ సంస్థలే పారిశ్రామిక ప్రగతికి నిదర్శనం



విశాఖపట్నం,**సత్యదీపిక ఉదయం**

ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయన్ని వాటిని పెట్టుబడిదారులు వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గురువారం విశాఖపట్నం లో రెండు రోజుల 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆవిష్కరించారు. పరిశ్రమలు, ఇంధనం, ఎలక్ట్రానిక్స్, రక్షణ, అంతరిక్షం, డేటా సెంటర్లు, పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, సాగునీటి రంగం ఇలా అన్ని అంశాల్లో రాష్ట్రానికి ఉన్న అవకాశాలు, ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలు, ఇప్పటికే సాధించిన పురోగతిని గణాంకాలతో సహా సీఎం వివరించారు. 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులోనే 303

మిగతా 2లో

ఆంధ్రప్రదేశ్--రష్యా భాగస్వామ్యానికి నూతన దిశ!

రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్, రష్యా ప్రతినిధి బృందానికి స్వాగతం పలుకుతూ, ఆంధ్రప్రదేశ్‌తో రష్యా భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.రష్యాతో తన అనుబంధం సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక సదస్సు పర్యటనతో మరింత బలపడిందని, ఆ సందర్భంగా రష్యాలోని వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో పాటు టటరస్థాన్ ప్రాంత నాయకత్వంతో సమావేశమయ్యే అవకాశం లభించిందని చెప్పారు. అక్కడి పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, అభివృద్ధి దృక్పథం తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలో బలపడిన భారత్--రష్యా సంబంధాలను కీలక ఖనిజాలు, మెటలర్జీ, తయారీ, చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్లు, కృత్రిమ మేధస్సు, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించవచ్చని మంత్రి నారా లోకేష్ తెలిపారు.

మెటలర్జీ, తయారీ, ఓడరేవుల మౌలిక సదుపాయాలు, సముద్ర రవాణా, ఆర్థిక లావాదేవీలకు అనువైన చెల్లింపు వ్యవస్థలు, బలమైన సరఫరా వ్యవస్థల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రష్యాలోని తతారిస్తాన్ ప్రతినిధుల భాగస్వామ్యంతో ఇరు ప్రాంతాల వ్యాపార సంస్థల మధ్య ప్రత్యక్ష అనుసంధానం, సంయుక్త పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలను విస్తరించే అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం మూడు ప్రధాన భరోసాలను అందిస్తోందని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.పెట్టుబడిదారులకు ఇచ్చిన ప్రోత్సాహకాల హామీలను సకాలంలో అందించేందుకు ఎస్క్రో విధానాన్ని, పెట్టుబడులపై ఇచ్చిన హామీలకు రక్షణ కల్పించేందుకు ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు వివరించారు. ఈ చర్యలు రాష్ట్రంలో పెట్టుబడులకు మరింత విశ్వసనీయ వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు. భారత్--రష్యా చిరకాల స్నేహబంధాన్ని ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మరింత బలోపేతం చేస్తూ, ప్రాంతీయ భాగస్వామ్యాలను అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక సహకారానికి వేదికగా మలచాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

భాగస్వామ్య విస్తరణకు రష్యా పూర్తి మద్దతు!
-భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్

భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌తోనూ వాణిజ్య, పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు రష్యా పూర్తి ఆసక్తితో ఉందని భారత్‌లో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో రష్యా ప్రతినిధి బృందానికి, తనకు అందించిన ఆత్మీయ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రష్యా ప్రతినిధి బృందానికి కేటాయించిన సమయం, అందించిన ప్రోత్సాహం, సహకారంపై ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

భారత్--రష్యా మధ్య బలమైన వ్యూహాత్మక సంబంధాలతో పాటు, రష్యాలోని తతారిస్తాన్ సహా వివిధ ప్రాంతాలకు, ఆంధ్రప్రదేశ్‌కు మధ్య ప్రాంతీయ భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల పారిశ్రామిక సంస్థలు, వ్యాపార వర్గాల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా కొత్త పెట్టుబడులు, సంయుక్త ప్రాజెక్టులకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

40 ప్రాధాన్యతా ప్రాజెక్టులు.. 50 బిలియన్ డాలర్ల పెట్టుబడుల లక్ష్యం

భారత్--రష్యా ఇరు పక్షాలు కలిసి సుమారు 40 కొత్త ప్రాధాన్యతా పెట్టుబడి ప్రాజెక్టులకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాయని, తద్వారా 50 బిలియన్ అమెరికన్ డాలర్ల పరస్పర పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకోవాలని భావిస్తున్నట్లు డెనిస్ అలిపోవ్ వెల్లడించారు. నావిగేషన్ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు ఆధారిత విమానాశ్రయ పరిష్కారాలు వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లోనూ పరస్పర సహకారానికి అవకాశాలున్నాయని వివరించారు. భారత్‌లో అణు విద్యుత్ కేంద్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్న రష్యాకు అణుశక్తి రంగంలో విశేష అనుభవం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉందని తెలిపారు.

చంద్రబాబు సమర్థ నాయకత్వంలో
రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు

విశాఖపట్నం,టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఏపీ ముందుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. విశాఖ వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థలపై సీఎం చంద్రబాబు ముందే ఆలోచించారన్నారు. పెట్టుబడులతో వస్తున్న వారికి నమ్మకం కల్పించడంలో ఆయన దిట్ట అని కొనియాడారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చారన్నారు.సంక్షోభాలు, సవాళు ఎన్ని ఉన్నా ప్రపంచ పెట్టుబడిదారులకు భారత్ భరోసాగా నిలుస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఏపీని పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనను ప్రశంసించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను దాటి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నారని కొనియాడారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేయడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతుందన్నారు. చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. నీరు, నిప్పులా చంద్రబాబు, మోదీ: ప్రధాని మోదీ, చంద్రబాబు ఆర్ఆర్ఆర్ సినిమాలో మాదిరిగా నీరు, నిప్పులా కలిసి అభివృద్ధి కోసం పని చేస్తున్నారని వ్యాఖ్యానించారు. విశాఖ స్టీల్ నగరం నుంచి సిలికాన్ సిటీగా ఎదుగుతోందని, ఓర్వకల్లు, పూడిమడక గ్రీన్ ఎనర్జీ కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయని వెల్లడించారు. మేధోసంపత్తి హక్కులను భారత్ పూర్తిగా గౌరవిస్తుందని, విదేశీ సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని బలవంతంగా కోరడం కానీ, వారి మేధోసంపత్తిని దుర్వినియోగం చేయడం కానీ చేయబోమని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో, వేగంగా తయారు చేసుకునేందుకు పరిశ్రమలకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికారు.

స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

అమరావతి, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ, పటిష్టమైన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో సమస్యాత్మక జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు జోక్యం, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను అధికారులు, పోలీసు యంత్రాంగం సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు.

ఎన్నికల షెడ్యూల్‌పై సమీక్ష:

ఇప్పటికే నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు తొలి విడతలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. తదుపరి ఎంపీపీ అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 19 న, జెడ్పీపీ చైర్మన్ ఎన్నికలు నవంబర్ 20 న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు నవంబర్ 12 న నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 26 న పోలింగ్, నవంబర్ 30 న ఓట్ల లెక్కింపు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల కలెక్టర్ల నుంచి అందిన అభిప్రాయాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని కౌంటింగ్ తేదీలో మార్పు చేసినట్లు వివరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు మూడు విడతల్లో నోటిఫికేషన్లు:

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. మొదటి విడతకు నవంబర్ 13 న, రెండో విడతకు నవంబర్ 16 న, మూడో విడతకు నవంబర్ 19 న నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.

మారుతున్న యుద్ధ తీరుకు అనుగుణంగా సైన్యం సిద్ధం కావాలి

యుద్ధాల తీరు మారుతున్నదని, ఈ నేపథ్యంలో ఏ రూపంలోనైనా ముప్పు పొంచి ఉండవచ్చని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు, ఆకస్మిక దాడులు నిర్వహించేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని సైన్యానికి పిలుపునిచ్చారు. ఢిల్లీ లో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలోఆయన మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాలని, ముప్పును ముందే పసిగట్టి నష్టం సంభవించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని రాజ్‌నాథ్ దిశానిర్దేశం చేశారు. శత్రువులు కోలుకోవడానికి సమయం ఇవ్వని సామర్థ్యాలను మన రక్షణ దళాలు పెంపొందించుకోవాలని, శత్రువులు ఉన్నపళంగా దాడి చేసినా వారి వ్యూహంలో చిక్కుకోకుండా ముందే అప్రమత్తమయ్యేలా బలంగా మారాలని సూచించారు. మన చర్యలు వారి ఊహకందని విధంగా ఉండాలన్నారు.గూఢచార, నిఘా యంత్రాంగాలను మరింత బలోపేతం చేసుకోవాలని, ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు ప్రతిక్షణం సిద్ధంగా ఉండాలని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాల గురించి ఆయన ప్రస్తావించారు. ఆధునిక యుద్ధాల్లో రైఫిళ్ల కంటే డ్రోన్‌లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌కు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఆత్మాహుతి డ్రోన్‌లు, నిఘా డ్రోన్‌ల వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

సైబర్ యుద్ధాలు, అంతరిక్షంలోనే ఆయుధాలను మోహరించి శత్రువులపై దాడి చేయడం లాంటి అత్యాధునిక యుద్ధ రీతుల కోసం ప్రత్యేక విధానాలను అభివృద్ధి చేయాలని వైమానిక దళానికి పిలుపునిచ్చారు.

మహిళల రాజకీయ, ఆర్థిక భాగస్వామ్యం మరింత పెరగాలి

విశాఖపట్నం,మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ సమాన భాగస్వాములుగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళల భాగస్వామ్యం రాజకీయ, ఆర్థిక రంగాల్లో 50 శాతానికి మించినప్పుడే తనకు సంపూర్ణ సంతృప్తి కలుగుతుందని అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా టెక్ పార్క్ ఏర్పాటు చేసి, ఉచితంగా భూమితో పాటు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన 'ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. 'ది ఉమెన్ హూ విల్ షేప్ ది నెక్స్ట్ ఎకానమీ: లీడర్‌షిప్, క్యాపిటల్, అంబిషన్' అనే థీమ్‌తో జరిగిన ఈ సదస్సులో కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ, సీఐఐ ప్రతినిధులు, అలయన్స్ ఫర్ గ్లోబల్ గుడ్ సభ్యులు, పారిశ్రామికవేత్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అవకాశాలిస్తే అద్భుత విజయాలు:

మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతమైన విజయాలు సాధిస్తారని ముఖ్యమంత్రి అన్నారు. పుట్టుక నుంచే మహిళల పట్ల వివక్ష చూపే ధోరణి సమాజంలో ఉందని, కొడుకు కుటుంబంతోనే ఉంటాడని, కూతురికి పెళ్లి చేసి పంపించేస్తామనే ఆలోచన మారాలని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థంగా నడిపించడం మహిళా సామర్థ్యానికి నిదర్శనమన్నారు.

విద్య, ఉద్యోగ రంగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో 50 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించామని, అత్యంత విద్యావంతులైన మహిళలకు మేయర్లు, చైర్‌పర్సన్లు, జెడ్పీ చైర్‌పర్సన్లుగా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించి, అందరూ అభివృద్ధి చెందాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు.

డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శం:

ఆంధ్రప్రదేశ్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 1.13 కోట్ల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్నారని, ఈ సంఘాల వద్ద రూ.30 వేల కోట్ల కార్పస్ ఫండ్ ఉందని తెలిపారు. ప్రస్తుతం ఈ సంఘాలు దాదాపు రూ.లక్ష కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని వెల్లడించారు. డ్వాక్రా మహిళలు తాము తీసుకున్న రుణాల్లో 99.6 శాతం తిరిగి చెల్లిస్తున్నారని, మహిళలకు ఆర్థిక క్రమశిక్షణ, వ్యాపార నిర్వహణ సామర్థ్యం ఎంతగా ఉన్నాయో ఇది తెలియజేస్తోందన్నారు. మహిళల వద్ద రూ.10 ఉంటే దానిని రూ.100గా మార్చగల వ్యాపార నైపుణ్యం వారిలో ఉందని వ్యాఖ్యానించారు. స్వయం ఏపీ బ్రాండ్‌తో మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళలు కేవలం స్వయం ఉపాధికే పరిమితం కాకుండా, పెద్దఎత్తున పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మహిళా శ్రామిక శక్తి 35.8 శాతంగా ఉందని, దీనిని త్వరలోనే 50 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు.

హైదరాబాద్ కొత్త సీపీగా మహేశ్ భగవత్ నియామకం

హైదరాబాద్, నవంబర్ 12: తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ప్రక్షాళన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. కీలక పోస్టుల్లో కొత్త అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ భగవత్ నియమితులయ్యారు.

ఇప్పటి వరకు హైదరాబాద్ సీపీగా బాధ్యతలు నిర్వహించిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డీజీగా బదిలీ చేసింది. అలాగే జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా, మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీగా సౌమ్య మిశ్రాకు బాధ్యతలు అప్పగించింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా చారు సిన్హాను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకేసారి ఇంతమంది కీలక అధికారులకు స్థానచలనం కల్పించడంతో పోలీస్ శాఖలో ఈ బదిలీలు చర్చనీయాంశంగా మారాయి.

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన ప్రాంతం

విశాఖపట్నం, పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ నమ్మకమైన ప్రాంతం అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. విశాఖ సీఐఐ సదస్సులో పాల్గొన్న పవన్? మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందన్నారు. 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న బలమన్నారు. కాకినాడలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో 15 ఎంవోయూలు కుదుర్చుకున్నామని పవన్ వివరించారు.నేటి సదస్సులో 150కి పైగా ఒప్పందాలు కుదుర్చుకోవడమే లక్ష్యమని తెలిపారు. ఉపాధి కల్పనలో ఏపీ ముందుందన్న పవన్ పెట్టుబడిదారులు ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పవన్‌కల్యాణ్ అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని పవన్ తెలిపారు.మీకు సరైన లక్ష్యం ఉంటే ఏపీ దాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సహాయం అందిస్తుంది. మీ దగ్గర మంచి ఆలోచన ఉంటే దాన్ని అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునందిస్తుంది. భవిష్యత్తును? నిర్మించాలన్న సంకల్పం ఉంటే ఆంధ్రప్రదేశ్? మీకు తోడుగా ఉంటుంది' అని పవన్? కల్యాణ్? పెట్టుబడిదారులకు స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తల కలలను, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలను నిజం చేసేందుకు ప్రభుత్వం భాగస్వామిగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు
ప్రత్యేక పారిశ్రామిక పార్కులు



అవగాహన ఒప్పందాల ద్వారా రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించనున్నట్లు ప్రకటించారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఇవి అదనం అని అన్నారు. దీంతో రాష్ట్రానికి వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనలు రూ.32.49 లక్షల కోట్లకు చేరాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ పెట్టుబడులను కేవలం ప్రతిపాదనలకే పరిమితం చేయకుండా, క్షేత్ర స్థాయిలో పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి, ఉపాధి కల్పన దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు వాటిని కార్యరూపంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సీఎం వివరించారు. సదస్సుకు ముందు జూన్ 2024 నుంచి రాష్ట్రానికి రూ.22.60 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టుల ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వీటిలో రూ.17.10 లక్షల కోట్ల విలువైన 526 ప్రాజెక్టులకు భూమి, ప్రోత్సాహకాలు తదితర అంశాలకు ఆమోదం లభించిందనీ వివరించారు. మరో రూ.7.30 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు నిర్మాణానికి సిద్ధమయ్యాయనీ స్పష్టం చేశారు. ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో సంఖ్యా పరంగా 58 శాతం నిర్మాణ సన్నద్ధత దశకు చేరుకోవడం పారిశ్రామిక ప్రణాళిక అమలులో పురోగతిని సూచిస్తోందని వివరించారు.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పరిశ్రమలకు రియల్ టైమ్‌లో అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పెట్టుబడులకు సంబంధించిన ప్రక్రియల్లో జాప్యం లేకుండా వేగంతో అనుమతులు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, భూమి కేటాయింపులు, ప్రోత్సాహకాలను వేగంగా అందిస్తున్నామని తెలిపారు. ఏపీలో ఈ విధానం అమలుకు కియా కార్ల పరిశ్రమ ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. ఆమ్మో డిఫెన్స్ ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి భూమి కేటాయించామని, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ కూడా 19 నెలల్లోనే సిద్ధమైందని, ఇది ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు

ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ రాజీనామా

ప్రపంచ అగ్రగామి చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సహ-వ్యవస్థాపకుడు, సీఈవో జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. వరుస వివాదాలు, వివాహేతర సంబంధాల ఆరోపణల నేపథ్యంలో ఆయన ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బోర్డు సభ్యుడిగా కూడా హువాంగ్ వైదొలిగారు. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆయన రాజీనామాను తక్షణమే ఆమోదించారు.హువాంగ్ స్థానంలో కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ కొలెట్ క్రెస్‌ను తాత్కాలిక సీఈవోగా నియమించినట్లు బోర్డు ప్రకటించింది. ఫుల్‌టైమ్ సీఈవో ఎంపిక ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు బోర్డు తెలిపింది.

స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బంది ఏర్పాట్లు

పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి
-- కలెక్టర్ మహేష్ కుమార్...
నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు -- ఎస్పీ రాహుల్ మీనా...



అమలాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి) : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని, నామినేషన్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రక్రియను వీడియోగ్రఫీ చేయించాలని సూచించారు.
గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి విడత పోలింగ్ నవంబర్ 26న, రెండో విడత నవంబర్ 29న, మూడో విడత డిసెంబర్ 2న జరగనుందని వెల్లడించారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులను బెదిరించడం, నామినేషన్లకు అడ్డంకులు సృష్టించడం, ఘర్షణలకు పాల్పడటంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకునేలా భద్రత కల్పిస్తామని తెలిపారు.ఏకగ్రీవ ఎన్నికలు స్వచ్ఛందంగా జరగాలని, ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులకు తావుండకూడదని అధికారులు స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో వి. సుబ్బారావు, సీపీఓ మురళీకృష్ణ, డీపీఓ శాంతికుమారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొబ్బరి వ్యర్థాలతో మహిళలకు ఉపాధి అవకాశాలు

బయోచార్ తయారీతో గ్రామీణ ఆర్థికాభివృద్ధి : కలెక్టర్ మహేష్ కుమార్



అమలాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి) : కోనసీమలో కొబ్బరి వ్యర్థాలను సంపదగా మార్చే బయోచార్, పైరోలసిస్ సాంకేతికత ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు కొత్త ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ కొబ్బరి వ్యర్థాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలన్నారు. ఉత్పత్తుల తయారీతో పాటు నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్‌కు ప్రోత్సాహం అందించాలని సూచించారు.
కోనసీమ ప్రత్యేకతను ప్రతిబింబించేలా స్థానిక ఉత్పత్తులకు బ్రాండ్ గుర్తింపు కల్పించి, మార్కెట్ అవకాశాలను పెంచేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ డి. రాంబాబు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల పండుగకు ప్రభుత్వ ధరల కానుక!

- రూ.100కే కిలో కందిపప్పు.. రూ.125కే లీటర్ పామాయిల్!

-రేషన్ కార్డుదారులకు భారీ ఊరట.. చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ



అమరావతి:క్రిస్మస్, సంక్రాంతి పండుగల వేళ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ సామాన్యులపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో, రేషన్ కార్డుదారులకు తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.మార్కెట్ ఇంటర్వెన్షన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారా రాయితీ ధరలకు సరుకులు పంపిణీ చేయనున్నారు

ప్రభుత్వం ప్రకటించిన ధరలు ఇవే!
- కందిపప్పు -- కిలో రూ. 100
- పామాయిల్ -- లీటరు రూ. 125
- గోధుమ పిండి -- కిలో రూ. 25

మూడు నెలల పాటు ప్రత్యేక పంపిణీ!
డిసెంబరు నుంచి వరుసగా మూడు నెలల పాటు ఈ రాయితీ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. పండుగల సమయంలో కుటుంబాలకు అవసరమైన సరుకులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడంతో పేదలకు కొంత ఆర్థిక వెసులుబాటు కలగనుంది.ఈ పథకం అమలుతో మూడు నెలల కాలానికి ప్రభుత్వంపై సుమారు రూ. 300.60 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ మేరకు రాష్ట్ర సివిల్ సప్లయీస్ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో కార్యదర్శి కె.కన్నబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.పండుగల వేళ సామాన్యులకు ధరల భారం తగ్గించి, నిత్యావసర సరుకులను అందుబాటు ధరల్లో అందించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.

కొత్తపల్లి అభినవ్ కు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందన

యువ క్రికెటర్ గా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట, నవంబర్ 12.(సత్య దీపిక ఉదయం ప్రతినిధి)
ఢిల్లీ బౌలింగ్ అకాడమీకి ఎంపికైన ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన పదహారేళ్ళ యువ ఫాస్ట్ బౌలర్ కొత్తపల్లి అభినవ్ ను వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయస్థాయి క్రికెట్ శిక్షణకు కొత్తపేట నియోజకవర్గానికి చెందిన యువకుడు ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.ఆన్లైన్ ట్రయల్స్ లో అద్భుత ప్రతిభ కనబరిచి ఢిల్లీ బౌలింగ్ అకాడమీకి ఎంపిక అవ్వడం ప్రతిభకు నిదర్శనమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కొత్తపేట నియోజకవర్గ ఖ్యాతిని, ర్యాలి గ్రామ కీర్తిని ప్రపంచవ్యాప్తం చేయాలని అభినవ్ ను ఆయన ఆశీర్వదించారు.

నేదునూరు గ్రామ నూతన ఎంపీటీసీలకు రావి ఫౌండేషన్ సత్కారం

గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా సమష్టిగా కృషి చేయాలి -- రావి ఫౌండేషన్





అయినవిల్లి సత్య దీపిక ఉదయం విలేకరి నవంబర్ 12: ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగంగా నేదునూరు గ్రామం నుంచి ఎంపీటీసీలుగా ఎన్నికైన శ్రీమతి పినిపే లక్ష్మి ఉమా మహేశ్వర రావు, శ్రీమతి బూసి విజయ నిర్మల చంద్రశేఖర్‌లను రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.రావి ఫౌండేషన్ కార్యదర్శి పాలగుమ్మి వెంకట కృష్ణ నేతృత్వంలో ఫౌండేషన్ సభ్యులు నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీల ఇళ్లకు వెళ్లి, వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి పాలగుమ్మి వెంకట కృష్ణ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని నూతన ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు.అలాగే, అయినవిల్లి మండల పరిషత్ అధ్యక్ష (వీఎ్ర) పదవికి పోటీలో ఉన్న ఎంపీటీసీ-1 శ్రీమతి పినిపే శ్రీలక్ష్మి ఉన్నత విద్యావంతురాలని పేర్కొంటూ, ఆమె ఎంపీపీగా విజయం సాధించి మండల స్థాయి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని రావి ఫౌండేషన్ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రావి ఫౌండేషన్ మెడికల్ ఇన్‌ఛార్జ్ జంగా నాగేశ్వరరావు, కంటి వైద్యులు పినిపే భూషణ్ వర్మ, ఫౌండేషన్ సభ్యులు వి.కె.ఆర్.ఎస్. శర్మ, అంగర శివ సాయి గౌడ్, కామన సాయి, సత్యవాడ మనోహర్, భావన పవన్ అర్జున్, ముక్కామల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధమైన దత్తతే పిల్లలకు సురక్షితమైన భవిష్యత్తు

-- జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీ ఆర్. రాజేష్



నర్సాపురం నవంబర్ 12 సత్య దీపిక ఉదయం విలేకరి.
జాతీయ దత్తత అవగాహన మాసం 2026 సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నర్సాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు అనాథ పిల్లల దత్తతపై ఆసుపత్రి వైద్యులకు మరియు సిబ్బంది , పేషెంట్ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా
జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీ ఆర్. రాజేష్ మాట్లాడుతూ ప్రజలకు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా కేంద్ర దత్తత వనరుల సంస్థ సి.ఎ. ఆర్.ఎ మరియు గుర్తింపు పొందిన ప్రత్యేక దత్తత సంస్థల ఎస్.ఎ. ఎ ద్వారా మాత్రమే దత్తత ప్రక్రియను చేపట్టాలని సూచించారు.
పిల్లలను దత్తత తీసుకోవడం అనేది ఒక పవిత్రమైన బాధ్యత అని, ప్రతి చిన్నారికి కుటుంబ ప్రేమ, ఆప్యాయత, రక్షణ మరియు మెరుగైన భవిష్యత్తును అందించడమే దత్తత యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సంతానాన్ని పొందడానికి ఎటువంటి అడ్డదారులు లేవు చట్టబద్ధమైన దత్తత ఒక్కటే సరైన మార్గం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మధ్యవర్తులు, అనధికార వ్యక్తులు లేదా సంస్థల ద్వారా పిల్లలను దత్తత తీసుకోవడం చట్టవిరుద్ధమని, అటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు
అలాగే, దత్తతకు సంబంధించిన రికార్డ్స్ పూర్తిగా ఉండాలి
ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాంబాబు, ఆర్.ఎం.ఓ డా లక్ష్మీ ప్రశాంతి,ఆసుపత్రి అభివృద్ధి కమిటి మెంబెర్ పి.నళిని , డా గణేష్ , డా చందన ప్రియాంక , డా నవీన , డా చరణ్ రాయ్, నర్సింగ్ సూపరింటెండెంట్ జ్యోతి, హెడ్ నర్స్ బాల నాగమ్మ , ఐసీటీసీ హెల్త్ కౌన్సిలర్ సైకాలజిస్ట్ జేసు ప్రసాద్ ప్రసాద్ బాబు , ప్రొటెక్షన్ ఆఫీస్ బి. నెహేమియ, సోషల్ వర్కర్ సునీత శాఖ అధికారులు, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీరువా తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించిన నిందితుడి అరెస్ట్

45.190 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



అనకాపల్లి నవంబర్:12
(సత్యదీపిక ఉదయం బ్యూరో)
అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ పి.వి.వి. నరసింహారావు మార్గదర్శకత్వంలో, సి.ఐ జి.ప్రేమ కుమార్ పర్యవేక్షణలో అనకాపల్లి టౌన్ పోలీసులు ఇంటి దొంగతనం కేసును చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి 45.190 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.
అనకాపల్లి పట్టణం, గాంధీనగరం ప్రాంతానికి చెందిన మెల్లిపాక ప్రమీల ఇంటిలో గత ఆగస్టు నెలలో గుర్తుతెలియని వ్యక్తి బీరువా తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలను దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
ఈ క్రమంలో పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, అనకాపల్లి టౌన్ ఎస్.ఐ ఎ.వెంకటేశ్వరరావు గారు తన సిబ్బందితో కలిసి ఈ రోజు (12.11.2026) మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో అనకాపల్లి పట్టణంలోని సిటీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా, లక్ష్మీదేవిపేట రైల్వే గేట్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.అరెస్టయిన నిందితుడి పోణకర్లపల్లి నాగేంద్రకుమార్ (25 సం॥)వృత్తి
శ్రీ మరిడమాంబ హెయిర్ స్టైల్ షాప్, చిన్నబాబు కాలనీ,
ప్రస్తుత నివాసం అంజయ్య కాలనీ, గాంధీనగరం, అనకాపల్లి పట్టణం.గుల్లిపల్లి గ్రామం, కె.కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాల వివరాలు (మొత్తం 45.190 గ్రాములు):బంగారు నల్లపూసల తాడు -- 24.840 గ్రాములు.బంగారు నెక్లెస్ -- 8.500 గ్రాములు.బంగారు చైనుతో కూడిన లాకెట్ -- 6.420 గ్రాములు
బంగారు బ్రాస్లెట్ -- 3.140 గ్రాములు.బంగారు ఉంగరం -- 2.290 గ్రాములు.నిందితుడిని అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న అనంతరం చట్టపరమైన చర్యలు పూర్తి చేసి గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.
ఈ కేసు ఛేదనలో అనకాపల్లి టౌన్ ఎస్.ఐ ఎ. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు ఎం.సముద్రం,ఆర్.పి.నాయుడు, మరియు టి.ఎస్.నాయుడు పాల్గొన్నారు. కేసును త్వరితగతిన ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

అదృష్టం కలిసొచ్చేనా?



అచ్చ తెలుగందం శ్రీలీలకు భారీ సినిమాల్లో అవకాశాలైతే వస్తున్నాయి కానీ..ఆశించిన విజయాలు మాత్రం దక్కడం లేదు. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా తెలుగులో ఈ భామకు సరైన విజయాలు దక్కడం లేదు. ఈ నేపథ్యంలో శ్రీలీల తమిళ సినీరంగంపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం కోలీవుడ్‌లో వరుసగా భారీ సినిమాల్లో నటిస్తున్నది.

ధనుష్ 'ఓం', అజిత్ 'డేర్ డెవిల్' చిత్రాల్లో అవకాశాలు దక్కించుకున్న ఈ భామ..ప్రస్తుతం రజనీకాంత్ 'ధర్మన్'లో కీలక పాత్రను పోషిస్తున్నది. ఇటీవలే ఈ సినిమాలో శ్రీలీల పాత్రను పరిచయం చేస్తూ లుక్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనికి మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో తమిళంలో 'ధర్మన్' చిత్రం తన కెరీర్‌కు ఊపునిస్తుందని, తన దశ మారుతుందనే ఆశాభావంతో ఎదురుచూస్తున్నది శ్రీలీల.

సినిమా న్యూస్

ఐకాన్ స్టార్ కోసం గ్యాంగ్ స్టర్ టైటిల్!



అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాకు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'రాకా' తర్వాత బన్నీ ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొననున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. దీఎ: ూతీఱఝుఱ్ష్ట ఖశీఱ్ష్ట్రుఎ । 12 చీశీజ 2026 5:53 ూవీ ూష్ట్రుతీవ: ఐకాన్ స్టార్ కోసం గ్యాంగ్ స్టర్ టైటిల్! ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ లాక్ అయిన సంగతి తెలిసిందే. బన్నీ -రాకా- నుంచి రిలీవ్ అవ్వగానే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. ఇప్పటికే లోకేష్ బన్నీ ఇమేజ్ కు తగ్గ కథను సిద్ధం చేసి ఉంచారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్ కు సంబంధించిన పనుల్లోనే లోకేష్ బిజీగా ఉన్నారు. లోకేష్ గత చిత్రాలు -లియో-, -కూలీ-లు భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా? వాటిని అందు కోవడంలో విఫలమవ్వడంతో తదుపరి చిత్రంతో హిట్ అందుకుని రేసులో నిలవాలని రేయింబవళ్లు శ్రమిస్తున్నారుఈ నేనపథ్యంలో తాజాగా ఈ సినిమా గురించి ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. అల్లు అర్జున్ ఇమేజ్‌కు..లోకేష్ మార్క్ యాక్షన్ శైలికి తగ్గట్టుగా పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

-పుష్ప- సిరీస్‌తో మాస్ ఆడియన్స్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న బన్నీని మరోసారి పవర్‌ఫుల్ రా అండ్ రస్టిక్ అవతార్‌లో చూపించడానికి లోకేష్ సిద్ధమవుతున్నారు. సాధారణంగా సినిమాలకు క్యాచీగా, మాస్ అప్పీల్ ఉన్న టైటిల్స్ పెట్టే లోకేష్ ఈసారి బన్నీ అలాంటి టైటిల్‌నే ఫిక్స్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

మామ్ గిల్ట్ అంటే ఏంటో అప్పుడే తెలిసింది!



తొలిసారి గర్భం దాల్చినప్పుడు హార్మోన్ మార్పులు, వాంతులు, శారీరక ఇబ్బందులతో ఎంతో ఇబ్బందిపడ్డానని కియారా అద్వానీ తెలిపారు. ఆ సమయంలో ఆలియా భట్, కత్రినా కైఫ్ వంటి తల్లులైన నటీమణులు తనకు అండగా నిలిచారని చెప్పారు. ప్రసవానంతరం సినిమాల్లోకి రీఎంట్రీ, కుటుంబం-కెరీర్ బ్యాలెన్స్‌పై ఆలియాతో చర్చించినట్లు వెల్లడించారు. దీఎ: ూతీఱఝుఱ్ష్ట ఖశీఱ్ష్ట్రుఎ । 12 చీశీజ 2026 2:30 ూవీ ూష్ట్రుతీవ: మామ్ గిల్ట్ అంటే ఏంటో అప్పుడే తెలిసింది! బాలీవుడ్‌లో కియారా అద్వానీ జర్నీ దేదీప్యమానంగా సాగిపోతుంది. ఓవైపు నటిగా బిజీగా ఉంటూనే? కుటుంబ బాధ్యతలు అంతే విధిగా నిర్వర్తిస్తుంది. అమ్మగా సైతం ప్రమోషన్ రావడంతో? ఆ మాతృత్వపు మధిరిమలను ఆస్వాదిస్తున్నారు. ఈనేపథ్యంలో తాజాగా గర్భదారణ సమయం నుంచి ప్రసవానంతరం దశ వరకు కియారా ఎదుర్కొన్న భావోద్వేగ మార్పుల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తొలిసారి గర్భం దాల్చినప్పుడు ఎదురయ్యే హార్మోన్ మార్పులు, వాంతులు, శారీరక ఇబ్బందుల వల్ల ఎంతగానో ఇబ్బంది పడ్డానని కియారా గుర్తు చేసుకున్నారు.బాహుబలి 2ను వెనక్కి నెట్టిన రామాయణం.. పుష్ప 2కు కూడా షాక్! ముఖ్యంగా తొలి మూడు నెలలు ఎవరికీ చెప్పలేక మనసులోని భావాలను పంచుకోవడానికి ఓ సరైన వేదిక కోసం వెతికానని తెలిపారు. ఆ సమయంలో తోటి నటీమణులు, తల్లులైన అలియా భట్, కత్రినా కైఫ్, పాత్ర లేఖలతో నిరంతరం టచ్‌లో ఉండి ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నామన్నారు. ఏ పరిశ్రమలోనైనా మహిళలను మహిళలే బాగా అర్థం చేసుకోగలరని కియారా అభిప్రాయపడ్డారు. ప్రసవానంతరం మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇవ్వడం ఎలా? కెరీర్‌ను, కుటుంబాన్ని ఒకే సమయంలో ఎలా బ్యాలెన్స్ చేయాలి? అనే విషయాలపై అలియా భట్‌తో ప్రత్యేకంగా చర్చించినట్లు కియారా తెలిపారు. ూశ్రీంశీ =ఝుఎ - ఐకాన్ స్టార్ కోసం గ్యాంగ్ స్టర్ టైటిల్! ూఎజవతీఱంవఎవఱ్ ఒక వైపు కుటుంబం.. మరోవైపు వృత్తిని బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకెళ్లడం చిన్న విషయం కాదు. ప్రస్తుతం కియారా రెండవ సారి గర్భం దాల్చిన సంగతి తెలిసిందే. మరికొన్ని నెలల్లో మరో బిడ్డకు జన్మనివ్వనుంది. ఈ నేపథ్యంలోనే పరిశ్రమలో తోటి హీరోయిన్ల మధ్య ఇలాంటి ఆరోగ్యకరమైన బాండింగ్ ఉండటం తనకెంతో మానసిక ఊరటనిచ్చిందన్నారు. తొలి సంతానం పుట్టిన తర్వాత ఎదురైన ఒంటరితనాన్ని అధిగమించడానికి ఫ్రెండ్స్ గ్రూప్ ఒకరికొకరు సపోర్ట్‌గా నిలిచారని తెలిపారు. షూటింగ్‌లు, బిజీ షెడ్యూల్స్ మధ్య కూడా తల్లులుగా తమ బాధ్యతలను ఎలా నిర్వర్తిస్తున్నారనే అంశాలపై తరచూ ఫోన్లలో మాట్లాడుకుంటున్నట్లు తెలిపారు.

ఇంతియాజ్ అలీ 'ఓ సాథి రే' విడుదల తేదీ ఖరారు!



బాలీవుడ్ దర్శకుడు ఇంతియాజ్ అలీ కొత్త రొమాంటిక్ సిరీస్ 'ఓ సాథి రే' విడుదల తేదీ ఖరారైంది. అదితి రావు హైదరి, అవినాష్ తివారీ, అర్జున్ రాంపాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సిరీస్ డిసెంబర్ 4న ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. విడాకులు తీసుకోబోతున్న ఒక జంట ప్రయాణంలో ఎదురయ్యే ప్రేమ, అసమానతలు, భావోద్వేగాల సంక్లిష్టతలను ఈ సిరీస్ అత్యద్భుతంగా ఆవిష్కరించనుంది. ఈ ప్రాజెక్ట్‌ను విండో సీట్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఇంతియాజ్ అలీ, మోహిత్ చౌదరి, శిబాశిష్ సర్కార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దీనికి ఇంతియాజ్ అలీ సృష్టికర్తగా వ్యవహరించగా, ఆరిఫ్ అలీ

బయట 100 కెమెరాలు.. లోపల వైట్ సోఫా రూల్!



బయట 100 కెమెరాలు..లోపల వైట్ సోఫా రూల్! బాలీవుడ్ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఏటా నిర్వహించే దీపావళి పార్టీకి పరిశ్రమలో ఎలాంటి క్రేజ్ ఉందో చెప్పనవసరం లేదు. మనీష్ ముంబై నివాసంలో జరిగిన గ్రాండ్ సెలబ్రేషన్స్‌కు సంపన్న వ్యాపారవేత్తలు, 350 మందికి పైగా బాలీవుడ్ స్టార్స్ సహా మీడియా కెమెరాలు పెద్ద ఎత్తున సందడి చేసాయి. అయితే ఈ హై-ప్రొఫైల్ పార్టీ లోపల అసలేంజరుగుతుంది? తారలు ఎలా ప్రవర్తిస్తారు? అనే విషయాలపై ఓ ప్రముఖ జర్నలిస్ట్ నమ్రతా జకారియా ఆర్టికల్ రూపంలో ఎవరికీ తెలియని రహస్యాలను బయటపెట్టారు. 2027లో బ్లాస్టింగ్ మామూలుగా ఉండదు! మనీష్ మల్హోత్రా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ..బయట కనిపించే ఫోటోల వెనుక పెద్ద తంతే ఉంటుందని రిపోర్టులు చెబుతున్నాయి. ఈసారి నివాసంలో 200 మందిని మాత్రమే ఆహ్వానించాల నుకున్నా? చివరికి అతిథుల సంఖ్య 350కి చేరింది.

PRINTED , PUBLISHED & " and OWNER By, "S.S.RAO," And PRINTED at JS PRINTRS D.NO.2/720-7/1, -URBAN COLONY,TOWN &MANDAL ATMAKUR,NANDYAL Andhra Pradesh, pin: 518422, And Published At DOOR NO: 5-642,ABBIREDDY COLONY, KAMANAGURUVU VILLAGE,AMALAPURAM MANDAL, DR.B.R.AMBEDKAR KONASEEMA DISTRICT, ANDHRA PRADESH - 533201.,"Email ID," sdudayam@gmail.com" Editor & Pro S.S.RAOR.N.I. NO : APTEL/26/A4267 MOBILE NUMBER: 9440869757, 9160541579

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు చేట్ల రామారావు కౌంటర్



అమలాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి): పరివర్తన రాజనీతి పార్టీ స్థాపించిన విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రటరీ చేట్ల రామారావు స్పందించారు. కొత్త పార్టీ స్థాపించే ముందు విజయసాయిరెడ్డి తన ప్రవర్తనలో పరివర్తన తెచ్చుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదని, జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో పార్టీకి అండగా ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీపై వ్యక్తిగత విమర్శలు, బురదజల్లే వ్యాఖ్యలు చేస్తే ధీటుగా సమాధానం చెబుతామని హెచ్చరించారు.

28వ వార్డు కౌన్సిలర్ మోకా వెంకట సుబ్బారావుకు ఘన సన్మానం



అమలాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి): స్థానిక మార్కెట్ ఏరియా సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చురుగ్గా కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటున్న 28వ వార్డు కౌన్సిలర్ మోకా వెంకట సుబ్బారావును సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంతో పాటు వార్డులో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పనలో సచివాలయ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ అడపా శివరామ ప్రసాద్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ చిల్లంగి ఎన్.ఎస్. శంకర్, వెల్ఫేర్ సెక్రటరీ యలిసెట్టి శ్రీను, ప్లానింగ్ సెక్రటరీ వాసంశెట్టి నాగశివకుమార్, వీఆర్వో బీర సుజాత, ఏఎన్ఎం గంధం అసాలత, ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ మనుగ్రర మంజులత, అమినిటీస్ సెక్రటరీ లంకె రాంబాబు, స్టేషన్ సెక్రటరీ వంకాయల సతీష్ బాబుతో పాటు సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయిస్తా!



అమలాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు గ్రామానికి చెందిన యువకుడు ఇళ్ల రామ్ కుమార్ (బాబ్జి) గ్రామాభివృద్ధిపై తన ఆలోచనలను వెల్లడించారు. గ్రామ ప్రజలు, పెద్దలు కలిసి తనను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే తన సొంత నిధుల నుంచి రూ.50 లక్షలు గ్రామాభివృద్ధికి కేటాయిస్తానని ప్రకటించారు. ఇళ్ల సత్యం మనవడైన రామ్ కుమార్ బీటెక్ పూర్తి చేసి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి, గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేయాలన్నది తన లక్ష్యమని తెలిపారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను తన సొంత నిధులతో చేపట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అవినీతికి తావులేని పాలన అందిస్తూ, పారదర్శకంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన సంకల్పమని ఇళ్ల రామ్ కుమార్ (బాబ్జి) వెల్లడించారు.

కొండాలమ్మ గుడి వద్ద ఉన్న గోదావరిని శుభ్రం చేయిస్తున్న కొత్తపల్లి



నరసాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి): నరసాపురం 9వ వార్డులోని కొండలమ్మ గుడి వద్ద ఉన్న పుష్కర రేవులోని మురుకును యుద్ధ యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కొత్తపల్లి శైలజ జానకి రామ్ అలాగే ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు నల్లి రాజేష్ మున్సిపల్ కౌన్సిలర్లు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.







రామాయణ కథ - శుద్ధపరబ్రహ్మ స్వరూప సాక్షాత్కార సాధనా సోపానములు

జటాయువు

పంచవటికి వెళ్ళే దారిలో జటాయువును రాముడు చూచేడు. జటాయువు రామునితో బిడ్డా ! నేను నీ తండ్రి అయిన దశరథునకు స్నేహితుడను. నేను నీకు పంచవటిలో సహాయకుడిగా యుంటాను అంటుంది. జటాయువు అనగా జట + ఆయువు. జట అనగా వేదాధ్యయన మార్గం విధానాలు. వేదాధ్యయన మార్గమే ఆయువుగా గలది జటాయువు. జటాయువు అన్న పదానికి వేదం, విజ్ఞానం ఆధారంగా యుండి అవసరపడతాయి. వేదములలోని కర్మకాండ విజ్ఞానం ఇంద్రియ నిగ్రహసాధనాన్ని సహాయపడటాన్నే ఉద్దేశింపబడినవి. కావున జటాయువు దశరథుని మిత్రుడు అని నీకు పంచవటిలో సహాయకుడిగా యుంటాను అనే పదాలకు అర్థం. వేదం కర్మకాండ పరమైనదే ఐనా 'నేను పరమాత్మను' అనే ఆత్మజ్ఞానానికి మనశ్శుద్ధి ద్వారా సహాయపడుతుంది. కర్మకాండ వల్ల మనశ్శుద్ధి, దాని వల్ల ఆత్మజ్ఞానం కల్గుతాయన్నమాట. ఈ విధంగా జటాయువు అన్న పదమునకు ఇంద్రియ నిగ్రహసాధనకు ఆత్మజ్ఞానం కల్గుతాయన్నమాట. ఈ విధంగా జటాయువు అన్న పదమునకు ఇంద్రియనిగ్రహ సాధనకు ఆత్మజ్ఞానసాధనకు తోడ్పడే 'వేదం' అన్న అర్థం సిద్ధిస్తుంది. రాముడు జటాయువును పూజిస్తాడు. తర్వాత కౌగిలించుకుంటాడు. తన తండ్రితో జటాయువునకు గల చెలిమిని గూర్చిన సంగతులు మరీ మరీ అడిగి విన్నాడు అనగా సాధకుడు వేదమార్గంలోని దశేంద్రియ నిగ్రహకారణమైన కర్మకాండ సాధనతో జ్ఞానమార్గాన్ని భక్తితో ఎంతెంతో తెలుసుకుని అవగాహన చేసుకున్నాడని అంతరార్థం ఇందులో యున్నది.

శూర్పణఖ

సీతారాములు పంచవటిలో గోదావరితీరంలో విహరిస్తుండగా 'శూర్పణఖ' అక్కడకు వచ్చింది. అనగా ఇంద్రియ వ్యాపారాన్ని రెచ్చగొట్టే పంచేంద్రియ వ్యాపారంలో ప్రకృతిలో సాధకుడు నిశ్చల సాధనతో వున్నాడు అక్కడ ఆ సాధనను చెడగొట్టే విఘ్నం ఎదురైంది అని అర్థం (శూర్పణఖ అనగా విఘ్నం). రాముడు శూర్పణఖను లక్ష్మణుని దగ్గరకు పంపిస్తాడు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోశాడు. సాధకుడు తనలోని జీవాత్మచేత (లక్ష్మణుని) అపరా ప్రకృతిని నాశనం చేయాలి. జీవాత్మ (లక్ష్మణుడు) వాసనాబంధం కలది కావున దాని చేతనే దుష్టవాసనా భూయిష్టమైన అపరాప్రకృతిని నాశనం చేయించాలి. జీవాత్మలో వాసనల ప్రభావం నశింపచేయడమే శూర్పణఖను లక్ష్మణుని దగ్గరకు రాముడు పంపడం. ముక్కుచెవులు కోయడం అనగా తామసిక రాజసిక గుణాలను జీవాత్మ నాశనం చేయడం అని అర్థం. తామసిక, రాజసిక గుణాల వల్ల సాధకునికి విఘ్నం కలగడం అది జీవాత్మ ద్వారా నాశనం చేసుకోవడం ఇందులో అంతరార్థం.

ఖరదూషణాదుల వధ

శూర్పణఖ ముక్కు చెవులు కోయడంతో సోదరుడైన ఖరుడి దగ్గరకు వచ్చి తన పరాభవం గురించి చెప్పుకుని ఏడ్చింది. అది విని ఖరుడు మండిపోయాడు. అతని వద్ద చతుర్దశ సేనాపతుల అధీనంలో చతుర్దశసహస్ర సంఖ్య గల రాక్షససేన యుంది. సేనాపతులను పిలిచి వారి వారి సేవలతో విజృంభించి సీతారామలక్ష్మణులు వెచ్చని రక్తంతో శూర్పణఖకు దాహం తీర్చాలని ఖరుడు ఆదేశించాడు. వారి వెళ్ళి యుద్ధం చేసి రామలక్ష్మణుల చేత హతమార్చబడ్డాడు. శూర్పణఖ అనగా ఇంద్రియ నిశ్చలతను చెరిపి వేసే దుష్టశక్తి అని చెప్పుకున్నాం. ఖరుడు అనగా ఖ = ఇంద్రియములు, ర = అగ్ని అనగా అగ్ని వంటి ఇంద్రియ వ్యాపారం అని అర్థం. ఇంద్రియ నిగ్రతను చెరిపి వేసే శక్తి వ్యర్థమైపోవడంతో సాధకునిలోని అపరాశక్తి ఇంద్రియాగ్నిని ఇంకా ఎక్కువగా ఉద్రేకిం పచేసిందనేది ఖరుడు మండిపడ్డాడు అనే దానికి అర్థం. ఇంద్రియాల వ్యాపారాన్ని ఎంత అణచి వేస్తే అంత పైపైకి లేస్తాయి. సాధకుడు తీవ్ర సాధనతో వాటిని అణచి వేయాలి. చతుర్దశ సేనాపతులు అనగా కర్మేంద్రియాలు అయిదు, జ్ఞానేంద్రియాలు ఐదు, అంతరంగ చతుష్టయం మొత్తం 14 ఇంద్రియాల వ్యాపార వృత్తి చతుర్దశ సేనాధిపతులు. సాధకునిలోని ఒక్కొక్క ఇంద్రియం అనేకానేక విధములైన వృత్తులు కల్గి యుండటం చతుర్దశ సహస్ర సంఖ్య గల రాక్షసులు అనగా అర్థం. చివరకు ఖరుని సేనలు రామ లక్ష్మణులు చేతిలో చచ్చిరి అనగా సాధకునిలోని ఆనందాంశ చేత ఆ 14వేల ఇంద్రియ ప్రవ త్తులు నాశనమయినాయని అర్థం. తర్వాత ఖరుడే యుద్ధానికి బయలు దేరాడు అనగా సాధకుని మీద ఇంద్రియాల ప్రజ్వలన ఎంత ప్రభలంగా సాగుతుందో అర్థం చేసుకోవాలి. తర్వాత రాముడు ఖరుణ్ణి వధిస్తాడు. అనగా ఇంద్రియ నిశ్చలత సాధించిన సాధకుడు ఇంద్రియాలు ఎంత ప్రలోభ పెట్టినా వాటికి లొంగడు అని అర్థం. ఇంద్రియాగ్ని తీవ్రతకు సాదకుడు బలికాకుండా ఉండాలంటే సాధకుడు తనలోని దేహాత్మ భావంను నశింప చేసుకుని ఈ దేహం నేను కాదు. దేహం లేని స్థితి నాది అనే జ్ఞానాన్ని ఆశ్రయించి జీవాత్మ చేత ఇంద్రియ వ్యాపార ప్రజ్వలనం జయించాలి. ఇంధనం లేనప్పుడు అగ్ని ఆరిపోయినట్లు సాధకునిలోని ఇంద్రియ వ్యాపారం అమనస్కస్థితిలో తానంతట అదే ఆగిపోతుంది. తర్వాత ఖరుని తమ్ముడు దూషణుడు మిగిలిన సైన్యాన్ని తీసుకుని రామ లక్ష్మణులపై యుద్ధానికి వస్తాడు. దూషణుడు అనగా దురహంకారం తాలూకా దుర్మత్తి. ఈ దురహంకార తామసిక దుర్మత్తిని సాధకునిలోని జ్ఞానానంద స్వరూపతత్వం నాశనం చేస్తుంది అనేది రాముడు దూషణుణ్ణి కూడా వధించడం. తర్వాత త్రిశిరుడు వచ్చి రామున్ని ఎదుర్కొని హతుడవుతాడు. త్రిశురుడు అనగా మూడుతలలు గల రాక్షసుడు. మూడు తలలు అనగా త్రిపుటి అని అర్థం. అహంకారం నశింపచేసుకున్న సాధకుని చేతిలో త్రిపుటినాశనమవుతుంది. కార్యం, కారణం, కర్త అనే బేధభావం యుండదు. అహంకారం నశించిన యెడల బేధబుద్ధికి, వాదోపవాదానికి చోటులేదు. కావున త్రిపుటి అనగా త్రిశురుడు నాశనం అయ్యాడు. ఈ విధంగా జనస్థాన రాక్షసులంతా రామునిచే చంపబడ్డారు. అనగా సాధకునిచే పునర్జన్మకు కారణమైన వాసనలు నశింపచేయబడ్డాయి అని అర్థం. (ఇంకా ఉంది)

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మెజారిటీ రారాజు.. విలేఖరి రాజు!

1,522 ఓట్ల భారీ ఆధిక్యంతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం

చెల్లుబాటైన ఓట్లలో 79.4 శాతం ఓట్లు కైవసం..

కాట్రేనికోన-1లో తిరుగులేని విజయం

అమలాపురం, నవంబర్ 12 (సత్యదీపిక ఉదయం విలేకరి): అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లో కాట్రేనికోన-1 ఎంపీటీసీ అభ్యర్థి పత్సమట్ల సూర్యనారాయణ రాజు (విలేఖరి రాజు) తిరుగులేని విజయాన్ని నమోదు చేశారు. ప్రత్యర్థిపై ఏకంగా 1,522 ఓట్ల భారీ మెజారిటీ సాధించి జిల్లా స్థాయిలోనే అత్యధిక అధిక్యంతో విజేతగా నిలిచారు. ఈ విజయంతో జిల్లాలో మెజారిటీ రారాజుగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో కాట్రేనికోన-1 స్థానం నుంచి పోటీ చేసిన విలేఖరి రాజుకు ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,675 ఓట్లు పోలవగా, 2,588 ఓట్లు చెల్లుబాటయ్యాయి. వీటిలో విలేఖరి రాజుకు 2,055 ఓట్లు లభించగా, ప్రత్యర్థికి కేవలం 533 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో 1,522 ఓట్ల భారీ ఆధిక్యంతో ఆయన ఘనవిజయం సాధించారు. చెల్లని ఓట్లు 87గా నమోదయ్యాయి.

ప్రతి నాలుగు ఓట్లలో మూడు ఓట్లు రాజుకే!

ఈ ఎన్నికల ఫలితాల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఓట్ల శాతం. చెల్లుబాటైన ఓట్లలో విలేఖరి రాజుకు ఏకంగా 79.4 శాతం ఓట్లు లభించాయి. ప్రత్యర్థికి 20.6 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. అంటే ప్రతి నాలుగు ఓట్లలో మూడు ఓట్లకు పైగా ఆయనకే లభించాయి. ఈ గణాంకాలు ఆయన విజయాన్ని ఎంతటి స్థాయిలో ఓటర్లు ఆదరించారో స్పష్టం చేస్తున్నాయి.

జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక చర్చ



స్థానికంగా విలేఖరి రాజుగా సుపరిచితులైన పత్స మట్ల సూర్యనారాయణ రాజు జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై అవగాహన, స్థానిక పరిస్థితులపై పరిచయం కలిగి ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల బరిలో నిలిచి జిల్లాలోనే అత్యధిక మెజారిటీ సాధించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక మైలురాయిగా నిలిచింది. ఈ ఘనవిజయంతో కాట్రేనికోన మండల రాజకీయాల్లో ఆయన పేరు ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. కేవలం గెలుపుతో సరిపెట్టుకోకుండా ప్రత్యర్థికి అందనంత దూరంలో నిలిచి భారీ ఆధిక్యం సాధించడం ఆయన విజయానికి ప్రత్యేకతగా నిలిచింది. విలేఖరి రాజు సాధించిన ఘనవిజయాన్ని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పలువురుప్రతి కూటమి నాయకులు, అభిమానులు, అనుచరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

గెలుపు సాధించడం ఒక విశేషమైతే.. జిల్లాలోనే ఉన్న అత్యధిక మెజారిటీతో గెలుపొందడం మరో విశేషం. 1,522 ఓట్ల ఆధిక్యం, 79.4 శాతం ఓట్ల మద్దతుతో విలేఖరి రాజు సాధించిన విజయం అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు తెరలేపింది.

గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి - కొత్తపేట శాఖా గ్రంథాలయం గ్రంథపాలకురాలు కుంచే సునీత



కొత్తపేట, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) : కొత్తపేట ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయం నందు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించ నున్నట్లు కొత్తపేట శాఖా గ్రంథాలయం గ్రంథపాలకురాలు కుంచే సునీత తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో గురువారం ఆమె మాట్లాడుతూ 14 వతేదీ న చాచా నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహించే బాలల దినోత్సవం తో వారోత్సవాలు ప్రారంభమవు తాయన్నారు. 15వ తేదీన పుస్తక ప్రదర్శన,16న గ్రంథాలయ ఉద్యమ కారుల సంస్మరణ సభ,17న కవి సమ్మేళనం, 18 విద్యార్థులకు వివిధ రంగాల్లో పోటీలు, 19న మహిళా సాధికారత పై చర్చ 20వ తేదీన వారోత్సవాల ముగింపు సభ,పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, కవులు, విద్యార్థులు పాల్గొంటారన్నారు. కావున ఈ వారోత్సవాలను జయప్రదం చేయాలని సునీత విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సతీమణి జన్మదినం సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ



నరసాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి): నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సతీమణి బొమ్మిడి సునీత నాయకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు గర్భిణులు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారంతా త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే బొమ్మిడి సునీత నాయకర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు.

అమలాపురం ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 13వ బ్యాచ్ ప్రారంభం



అమలాపురం, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం విలేకరి): అమలా పురం ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 16 మంది అభ్యర్థులతో 13వ బ్యాచ్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. జిల్లా రవాణా అధికారి డి.శ్రీని వాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డ్రైవర్ల చేతుల్లో ఎంతో మంది ప్రాణాలు ఉంటాయని, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. జిల్లా ప్రజారవాణాధికారి జి.సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైవింగ్‌తో పాటు బస్సుల నిర్వహణపై కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డిపో మేనేజర్ ఐ.ప్రేమ్‌కుమార్ అభ్యర్థులకు పార్థపుస్తకాలు అందజేశారు. త్వరలో 14వ బ్యాచ్ ప్రారంభించ నున్నట్లు, ఆసక్తి గల వారు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కె.ఎస్.రావు (9440772183)ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

బస్సు స్టాండ్‌లో వాహనాల రద్దీ.. ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు!

బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం.. పట్టించుకోని అధికారులు





పలాస, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం బ్యూరో) : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ బస్సు స్టాండ్‌లో వాహనాల ఇష్టారాజ్యపు పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. బస్సులు స్టాండ్‌లోకి రావాలన్నా, బయటకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవైపు పండ్ల బండ్లు, మరోవైపు కూరగాయల విక్రయదారులు రహదారులను ఆక్రమించడంతో పాటు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తుండటంతో బస్సుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే బస్సు స్టాండ్‌లో కనీస ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లేకపోవడంతో ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా బస్సులు స్టాండ్‌లోకి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో వాహనాల మధ్య ఇరుక్కుపోయి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది . దీంతో ప్రయాణికులతో పాటు బస్సు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. బస్సు స్టాండ్ ప్రాంగణంలో అనధికార పార్కింగ్‌ను నియంత్రించడంతో పాటు, పండ్లు, కూరగాయల విక్రయదారులకు ప్రత్యేక స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి వాహనాల పార్కింగ్‌కు క్రమబద్ధమైన ఏర్పాట్లు చేసి బస్సుల రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాళ్లపూడి మండలంలో వేడెక్కుతున్న పంచాయతీ రాజకీయం

తాళ్లపూడి 12 నవంబర్ సత్యదీపిక ఉదయం:– సర్పంచ్ ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల కాకుండానే గ్రామాల్లో రాజకీయ సమీకరణాలు రాక రకాలుగా మారుతూ వేడి వేడి గా సాగుతున్నాయి. గత ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ వర్గీయులు అదే స్పీడు కొనసాగించి సర్పంచ్ లు సాధించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఒకసారి వోడిన వారు మరింత కసిగా పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాల్లన్న రీతిన పోటీకి సిద్ధమవుతున్నారు. కొత్తగా కొంత మంది ఎన్నికల రణరంగం లోకి రావాలని ప్రయత్నిస్తున్నారు. ఆ కోవలో చదువుకున్న వ్యక్తులు ఆధార్వాలతో గ్రామాభి వృద్ధే ద్యేయ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలనీ ప్రవేట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యాధికుడు, జర్నలిస్ట్ గా వున్న జొన్నకూటి ప్రమోద్ కుమార్ ప్రక్కిలంక పంచాయతికి పోటీ చేస్తున్నారు. మండల కేంద్రమైన తాళ్లపూడి సర్పంచ్ పదవి జనరల్ కు కేటాయించటం తో సీనియర్ టీడీపీ నాయకులు నామన పరమేశ్వర్రావు పోటీ చేయనున్నారు. ఇటీవల జరిగిన ఎంపీటీసి ఎన్నికల్లో నామన పరమేశ్వర్రావు తన వర్గాన్ని గెలిపిం చుకున్నారు. వైకాపా నుండి మైగాపుల ఆంజనేయులు పోటీ చేస్తున్నట్లు వెల్లడయింది. కాగా వీరితో పాటు జనరల్ స్థానం లో ఎవరైనా పోటీ చేయ వచ్చని మరి కొంత మంది పోటీకి సిద్ధ మంటు న్నారు. మిగతా గ్రామాల్లో కూడా పార్టీలను పక్కకు బెట్టి పోటీకి సిద్ధ మవుతున్నారు. తాడిపూడి లో జనసేన కు చెందిన గంటా కృష్ణ భార్య పోటీ చేయనున్నారు. ఇక్కడ ఇంకా కొంతమంది పోటీ చేయాలనీ భావి స్తున్నారు. పెద్దేవం లో జనసేన, టీడీపీ మధ్య సయోధ్య కుదర లేదు. కానీ ఎంపిటిసి ఎన్నికల ముందు ఒప్పందం ప్రకారం టిడిపికి చెందిన



నాయకులు కోడి శంకరం పోటీ చేయనున్నారు. అన్నదేవర పేట లో టీడీపీ తరుపున సీసాల భీమరాజు వైఖపా తరపున కాంట్రాక్టర్ జి.ఈశ్వర్రావు,మలకపల్లి నుండి కుంటముక్కల కేశవ్, పోటీ చేయనున్నారు. కూటమిలో సీట్ల సర్దుబాటు ఒక కొలిక్కి రాలేదు

మల్లవరంలో వైసీపీకి బిగ్ షాక్... 300 కుటుంబాలతో టీడీపీలోకి భారీ వలస!

గెలిచిన వైసీపీ ఎంపీటీసీతో సహా మాజీ సర్పంచ్,

వైసీపీ గ్రామ అధ్యక్షుడి చేరిక... మల్లవరంలో వైసీపీ ఖాళీ!



కాకినాడ జిల్లా, జగ్గంపేట – నవంబర్ 12 (సత్య దీపికా ఉదయం విలేకరి) – స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం గోకవరం మండలం మల్లవరం గ్రామంలో వైసీపీకి పెద్ద దెబ్బ తగిలింది. గ్రామ వైసీపీ నాయకత్వం మొత్తం 300 కుటుంబాలతో వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ సమక్షంలో వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదర స్వాగతం పలికారు.

టీడీపీలో చేరిన వారు...

- మాజీ సర్పంచ్ సేనాపతి త్రిమూర్తులు
- మల్లవరం గ్రామ వైసీపీ అధ్యక్షులు పైల కళ్యాణ్
- వైసీపీ ఉపాధ్యక్షులు పల్లెల నాగబాబు
- నూతనంగా విజయం సాధించిన వైసీపీ మల్లవరం ఎంపీటీసీ సభ్యులు పిట్ట వెంకట స్వాతి నాని బాబు
- జగ్గంపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆది వెంకటరమణ
- మల్లవరం నీటి సంఘం ఉపాధ్యక్షులు నున్న గుప్పల వెంకటేశ్వరరావు

వైసిపి ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు నామా చిన్నారావు,తదితర 300 కుటుంబాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ... “మల్లవరంలో వైసీపీ పూర్తిగా ఖాళీ అయిపోయింది. గెలిచిన ఎంపీటీసీతో సహా గ్రామ వైసీపీ నాయకత్వం మొత్తం టీడీపీలోకి రావడం అంటేనే ప్రజలు ఎటువైపు ఉన్నారో అర్థం అవుతుంది.

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు వస్తున్నారు. మల్లవరం గ్రామాన్ని అన్ని విధాలా ఇప్పటికే అభివృద్ధి చేశాను, ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించేందుకు ముఖ్యమంత్రిని తీసుకొచ్చి శంకుస్థాపన నిర్వహించేందుకు కృషి చేస్తానని మొన్న మల్లవరం పర్యటించినప్పుడు రోడ్డు చాలా ఇబ్బందిగా ఉంది అని దీనిని రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసేందుకు సాంక్షన్ రావడం జరిగిందని ఎన్నికలు అయిన తర్వాత పనులు ప్రారంభిస్తామని అన్నారు. మన గ్రామ సరిహద్దుల్లో ఉన్న భూపతి పాలెం వద్ద కంచి కామకోటి పీఠాధిపతి వారి సహకారంతో ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నానని కేజీ నుండి పీజీ వరకు, ఇంజనీరు, డాక్టరు చదువులతోపాటు 14 వందల పడకల ఆసుపత్రి కూడా ఏర్పాటు చేసేందుకు తొందరలోనే ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని దీనిని అంచలంచలుగా నిర్మాణం చేపట్టడం జరుగుతుందని దీని నిర్మాణానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని అన్నారు. ముఖ్యంగా మీరంతా నాకు అండగా కలిసి గా వస్తే ఇంకా మరింత అభివృద్ధి పథంలో మల్లవరం గ్రామాన్నినడిపిస్తాను. చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం, ప్రాధాన్యత ఇస్తాం” అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోకవరం ఎంపీపీ జనపరెడ్డి హిమ సైలు సుబ్బారావు (బాబు) రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, టిడిపి మాజీ సర్పంచ్ యిడుదల అర్జున్ రావు, సత్యం రాజా, ఎంపీటీసీ గోర్రపల్లి శ్రీను, మాజీ ఎంపీటీసీలు మెరిసే అప్పారావు, జనసేన నాయకులుజీవి నాయుడు, మాజీ ఎంపీటీసీ శిరం దాసు రాజు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రావులమ్మ నగర్ కార్యాలయం జనంతో కిక్కిరిసిపోయింది.

పలాస పురపీఠం తొలి మహిళా చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం!

వజ్జ భవానిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది



పలాస, (సత్యదీపిక ఉదయం బ్యూరో): పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన తొలి మహిళ వజ్జ భవానిని పురపాలక సంఘం తరపున ఘనంగా సన్మానించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా విభాగం ప్రతినిధులు నూతన చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ. శ్రీనివాసులు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం) పి.మోహన్‌రావు, డీఈఓలు, సీఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్), స్లమ్ లెవల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్) ఆఫీస్ బేరర్లు, రిసోర్స్ పర్సన్లు కూడా కార్యక్రమంలో పాల్గొని చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పలాస––కాశీబుగ్గ పట్టణ అభివృద్ధిలో నూతన చైర్‌పర్సన్ కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పాల్గొన్న అధికారులు, సిబ్బంది ఆకాంక్షించారు. నూతన చైర్‌పర్సన్ నాయకత్వంలో పురపాలక సంఘం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

అక్షరాస్యతక్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన, క్విజ్ పోటీలు



కొత్తపేట, నవంబర్ 12 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) – కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. “స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియ అనే అంశంపై క్విజ్ పోటీని నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పి. రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రాధాన్యత ఎంతో గొప్పదని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పన, ఓటు హక్కు వినియోగం, ఎన్నికల ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ముఖ్యంగా యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని సూచించారు. ఒక్కొక్క పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో ఇద్దరు చొప్పున ఎంపిక చేసి వారిని నియోజకవర్గ స్థాయిలో జరిగనున్న పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. కళాశాల అధ్యాపకులు యు. సిద్ధార్థ కుమార్, పి. సాయి కృష్ణ, బి. విజయ కుమార్, కె.ఎస్.ఎన్. ప్రసాద్, ఎ. దీపికా దేవి, ఎం. హేమలత, చి. నాగ శ్రీ లక్ష్మి, తో పాటు జానక్యరామ్, కావ్య, సాయిలక్ష్మి పాల్గొని సహకరించారు.

ఆరోగ్య కేంద్రానికి అసోగో ఇండస్ట్రీస్ రూ.2.20 లక్షల విలువైన విద్యుత్ పరికరాల వితరణ



గోకవరం, నవంబర్ 12 (సత్య దీపికా ఉదయం విలేకరి) : సామాజిక బాధ్యతలో భాగంగా గోకవరం మండలంగుమ్మలదొడ్డి అసాగో ఇండస్ట్రీయాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం ద్వారా గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి సుమారు రూ.2,20,000 విలువైన విద్యుత్ పరికరాలను అందజేసింది. ఈ కార్యక్రమంలో అసాగో ఇండస్ట్రీస్ ప్లాంట్ హెడ్ కె. దేవేందర్, ఏవిపి పుల్లారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ బి. భవానీ శంకర్, హెచ్ఆర్ హెడ్ వీర వెంకట నాగరాజు పాల్గొన్నారు. అలాగే ఆసుపత్రి తరపున సూపర్డెంట్ డాక్టర్ శ్రీమతి రామలక్ష్మి, హెడ్ నర్స్ శ్రీమతి జాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ సామాజిక ఆరోగ్య కేంద్రానికి విలువైన విద్యుత్ పరికరాలను అందించిన అసాగో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్‌కు, యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన అత్యవసర సమయాల్లో ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా శస్త్రచికిత్సల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా వైద్య సేవలు కొనసాగించేందుకు ఇవి దోహదపడతాయని, తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలతో పాటు ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధికి కూడా తోడ్పడటం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.



పార్టీలు కాదు! ఈసారి కి ప్రమోద్ ని చూద్దాం!!

ఏ నోట విన్న ఇదే మాట - ఏ గుంపు నడిగిన సరికొత్త బాట

తాళ్లపూడి, నవంబర్ 12 (సత్య దీపికా ఉదయం విలేకరి) తాళ్లపూడి మండలం ప్రక్కిలంక పంచాయతీలో గల పైడిమెట్ట ప్రక్కిలంక ఇరు గ్రామాల ప్రజలు కూడా గత 30 ఏళ్ల నుండి ఎంతోమంది నాయకుల్ని చూసాం! ఈసారి విద్యావంతుడు, యువకుడు, జనాధారణ కలిగిన వ్యక్తి ప్రమోద్ ని మనందరం ఏకతాటిగా గెలిపించుకుంటే ప్రక్కలంక పంచాయతీని అభివృద్ధి పథంలో, మన అందరి సహకారంతో డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్ నడపగలరు అనే భావన ప్రజల్లో రోజు,రోజుకు పెరుగుతుండడంతో మరీముఖ్యంగా యువతీ, యువకులు కూడా ఈ ఒక్కసారికి ప్రమోద్ ని చూద్దాం అనే నినాదం ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆశ్చర్యం. వాస్తవానికి కూడా నాయకులు పెద్దలు యువకులు ఏ గుంపు చూసినా, ఏ నోట మాట విన్నా ఈ ఒక్కసారి కి ప్రమోదిని గెలిపించుకుందాం అనే నినాదం బలంగా ప్రజల్లో, ప్రక్కలంక గ్రామపంచాయతీలో మారు మ్రోగుతుందని కొందరు ప్రముఖులు, విద్యావంతులు అభిప్రాయం.









జాతీయ తెలుగు దినపత్రిక

సత్య దీపిక

ఉదయం

www.satyadeepikaudayam.com

తెలంగాణ ప్రజల గొంతుక ..నిజాలు వెలుగుల్లోకి





ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంగా

పీఆర్‌టీ విధానం!

కోర్ అర్బన్ ఏరియాలో కీలక ప్రాంతాల గుర్తింపు..... .... వెంటనే కార్యాచరణ చేపట్టాలని సీఎం ఆదేశం.

హైదరాబాదు ,సత్యదీపిక ఉదయం :

కోర్ అర్బన్ ఏరియా (CURE) పరిధిలో ట్రాఫిక్ సమస్యలు, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, కాలుష్య నియంత్రణ వంటి ముఖ్యమైన అంశాలను పరిగణలోకి తీసుకుని కీలక ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ విధానం అమలు చేయడానికి సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (PRTS) విధానంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు అత్యంత రద్దీగా ఉండే మార్గంలో పీఆర్‌టీ లైన్‌ను వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు సంబంధించి డిసెంబర్ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఏడాది కాలంలో ఆ మార్గంలో పీఆర్‌టీ వ్యవస్థ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ మార్గంలో గచ్చిబౌలి ఐకియా సమీపంలో మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసి అందులో పీఆర్‌టీ డిపోను నిర్మించాలని చెప్పారు. నగరంలో ఎల్‌బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా రాణిగంజ్ బస్టాండ్ వరకు మరో పీఆర్‌టీ లైన్ నిర్మించాలని సూచించారు. అసెంబ్లీ మెట్రోస్టేషన్ నుంచి రవీంద్రభారతి, సచివాలయం, ఐమాక్స్ నుంచి బేగంపేట్ ను కలుపుతూ మరో పీఆర్‌టీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ మార్గంలో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేసి అందులో పీఆర్‌టీ డిపోను నిర్మించాలని ఆదేశించారు.

విద్యార్థుల మౌలిక వసతులపై

ప్రత్యేక దృష్టి సారించాలి

- **ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి**
- **నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలి**
- **సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలి**
- **ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ భూ ఆక్రమణలకు అవకాశం కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల ప్రతినిధి,సత్యదీపిక ఉదయం

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండలంలోని ప్రాంతాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. పాఠశాలలకు అవసరమైన బెడ్స్

9లో



తక్షణమే స్పందించాలి.. నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేయాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి బ్యూరో, సత్యదీపిక ఉదయం :

నేరాల నియంత్రణకు పోలీస్ అధికారులు తమ సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోవాలని,తమ పరిధిలో జరిగే ప్రతి ముఖ్యమైన ఘటనపై తక్షణమే స్పందిస్తూ,నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు, పెండింగ్ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు,నేర పరిశోధన తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా, పోలీస్ స్టేషన్ల వారీగా పరిస్థితులను సీపీ సమీక్షించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల ప్రస్తుత స్థితి, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, చార్జిషీట్‌ల దాఖలు, సాక్ష్యాధారాల సేకరణ,కోర్టు కేసుల పురోగతి, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల నమోదు తదితర అంశాలపై ఎస్‌హెచ్‌ఓలను అడిగి తెలుసుకున్నారు.

9లో

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 12,సత్యదీపిక ఉదయం :

అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించడంతో పాటు, లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సోన్ మండలం సంగెంపేట్



గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు అవసరమైన అన్ని సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని, తద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ వివిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి పనులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, హౌసింగ్ డీఈ గంగాధర్, సర్పంచ్ విలాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 12,సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఉపాధ్యాయులు అంకితభావంతో బోధన సాగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.



గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులందరూ ప్రతిరోజూ పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని తిరిగి పాఠశాలలకు వచ్చేలా చూడాలన్నారు. నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయడంతో పాటు, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు పరీక్షలు నిర్వహించాలని, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులందరూ విధులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని స్పష్టం చేశారు.అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, సురక్షిత తాగునీరు అందించడంతో పాటు, పాఠశాలలు, వసతి గృహాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, సంక్షేమ శాఖల అధికారులు దయానంద్, నిహారిక, శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల క్రమబద్ధీకరణకు తెలంగాణ రక్షణ సేన మద్దతు

- 2 దశాబ్దాల సేవలకు గుర్తింపునివ్వాలి.. ఉద్యోగ భద్రత కల్పించాలి: డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి

మంచిర్యాల, సత్యదీపిక ఉదయం :

గత 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రక్షణ సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి డిమాండ్ చేశారు.ఉద్యోగుల



న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా 30 రోజులుగా కొనసాగుతున్న శాంతియుత ఆందోళనకు ఆయన సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సంఘీభావ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగులకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, మానవతా దృక్పథంతో వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన పోరాటానికి తెలంగాణ రక్షణ సేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పెద్దపల్లి పార్లమెంటు ఇన్‌చార్జి తిప్పారపు సారయ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తిప్పారపు సారయ్య, హారిక రావు, నిషా, రాచకొండ సురేష్, లెనిన్, సంధ్య, శ్రీవాణి, జహీర్ ఖాన్, రజిత, రాజశేఖర్, ప్రశాంత్, జ్యోతి, వసంత, కాసిపేట మండల అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మందమరి ఏరియాలో ఘనంగా బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభం

- నాణ్యతే ప్రగతికి ప్రమాణికం. - దాని పరిరక్షణ అందరి బాధ్యత.

- మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ.

మందమర్రి, సత్య దీపిక ఉదయం:

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్





మందమర్రి ఏరియాలో బొగ్గు నాణ్యత వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ వారోత్సవాలకు "నాణ్యతే ప్రగతికి ప్రమాణికం.. దాని పరిరక్షణ అందరి బాధ్యత" అనే నినాదాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై క్వాలిటీ పతాకాన్ని ఆవిష్కరించి వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఐఏఎస్ దూరదృష్టి, సమర్థవంతమైన నాయకత్వంలో సంస్థ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఎదుగుతోందని అన్నారు. గత 136 సంవత్సరాలుగా దేశంలోని విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు, వివిధ పరిశ్రమలకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఆర్థికాభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో మందమర్రి ఏరియా బొగ్గు నాణ్యతా ప్రమాణాలతో పాటు ఉత్పత్తి, డిస్పాచ్ రంగాల్లోనూ ముందంజలో ఉండటం సంతోషకరమన్నారు. ఈ విజయాల వెనుక యాజమాన్యం, అధికారులు, కార్మికుల సమిష్టి కృషి ఉందని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఒకే బృందంగా పనిచేస్తూ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం ఒక్కరోజే మూడు రేకుల ద్వారా సుమారు 13 వేల టన్నుల బొగ్గును విజయవంతంగా డిస్పాచ్ చేయడం విశేషమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించేందుకు కృషి చేసిన అధికారులు, కార్మికులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రస్తుతం మందమర్రి ఏరియా 100 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తూ ముందుకు సాగుతోందని వెల్లడించారు. బొగ్గు నాణ్యత విషయంలో సంస్థకు మరింత మంచి పేరు తీసుకురావడంతో పాటు భవిష్యత్తులోనూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, సరఫరా సంస్థ అభివృద్ధికి ఎంతో కీలకమని, నాణ్యత పరిరక్షణ ప్రతి ఉద్యోగి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం పర్సనల్ సీహెచ్. అశోక్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ రవి, క్వాలిటీ మేనేజర్ ప్రదీప్, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు సీవీ రమణ, జీఎం కార్యాలయ ఫిట్ కార్యదర్శి సృజన గీతిక, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి - జిఎం శ్రీరమేష్



తాండూరు, సత్యదిపిక ఉదయం

పోటీ ప్రపంచంలో నాణ్యమైన వస్తువుకు ఎప్పటికైనా మార్కెట్లో డిమాండ్ ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీరమేష్ అన్నారు. గురువారం గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో నాణ్యత వారోత్సవాలను ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. నాణ్యత పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనరుల వద్ద బొగ్గును నాణ్యత గా వెలికితీస్తే సంస్థ కు లాభాలతో పాటు వినియోగదారులు సంతృప్తి చెందుతారన్నారు.ప్రతి వ్యక్తి చేసే పనిలో నాణ్యత ఉండాలన్నారు. వ్యక్తి ప్రవర్తనలో నాణ్యత సమాజంలో ఆదర్శంగా నిలిపితే వస్తు నాణ్యత మార్కెట్లో ప్రథమ శ్రేణిలో ఉంచుతుందన్నారు. సింగరేణి వ్యాప్తంగా నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించడంలో బెల్లంపల్లి ఏరియా 90 శాతంతో మొదటి స్థానంలో ఉందన్నారు. అందుకు కృషి చేస్తున్న ఖైరిగుర ఉపరితల గని, సివిచ్పి అధికారులు, ఉద్యోగులను అభినందించారు. కార్యాలయ సిబ్బంది రికార్డులు రూపొందించేటప్పుడు శ్రద్ధ కనబరిస్తే అవి సకాలంలో గమ్యాన్ని చేరి త్వరగా పనులు పూర్తయ్యేల చేస్తాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి బొగ్గు ఉత్పత్తిగా వెలుగొండుతుందని కొనియాడారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో కలిసి నాణ్యత ప్రతిజ్ఞ చేసారు.అనంతరం ఖైరిగుర ఉపరితల గనివద్ద పిఓ మచ్చగిరి నరేందర్, గోలేటి సివిచ్పి ఆవరణలో హెచ్ఓడి కోటయ్యలు ఉద్యోగులతో కలిసి బొగ్గు నాణ్యత వారోత్సవాల సందర్భంగా నాణ్యత పతాక ఆవిష్కరణ , నాణ్యత ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యుసి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఏరియా ఇంజనీర్ బి.వీరన్న, డిజిఎం పర్సనల్ దేవరకొండ కిరణ్ బాబు,ఎస్ ఓ టూ జీఎం ఇ.స్వామిరాజు, క్వాలిటీ హెచ్ ఒడి రాజేష్ బాబు, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ వివిధ విభాగాధిపతులు, జిఎం కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్కు గ్రామస్తుల వినతి

తాండూర్, సత్యదిపిక ఉదయం

అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉన్న స్థలాన్ని గ్రామ ప్రజల సామూహిక కార్యక్రమాల కోసం కేటాయించగా, అదే గ్రామానికి చెందిన దుర్గం చిన్నమ్మ కుటుంబం ఆక్రమించిందని కొమ్ముగూడెం గ్రామస్తులు ఆరోపించారు. ఈ స్థలాన్ని కబ్జా



నుంచి కాపాడి, గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం తాండూర్ తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ కల్పనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. అచ్చులాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ ప్రజలందరూ కలిసి అంబేద్కర్ జయంతి, బతుకమ్మ, దసరా, వినాయక చవితి తదితర పండుగలు, వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన దుర్గం చిన్నమ్మ కుటుంబం ఆ స్థలాన్ని ఆక్రమించుకోవడంతో పాటు, స్థలం విషయంలో ప్రశ్నించిన గ్రామస్తులను దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తమపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ స్థల వివాదంపై 2025 మార్చి నెలలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాండూర్ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఆర్ఐ, సర్వేయర్లు వచ్చి స్థలాన్ని సర్వే చేసి,సదరు స్థలం దుర్గం చిన్నమ్మ కుటుంబానికి చెందిందికాదని,గ్రామ ప్రజల సామూహిక అవసరాల కోసం కేటాయించిన స్థలమని రెవిన్యూ అధికారులు నివేదిక ఇచ్చినట్లు పేర్కొన్నారు.అయితే అప్పటి తహ అధికారులు అధికారులు బదిలీ కావడంతో, ఇన్ని నెలల తర్వాత మళ్లీ ఆ కుటుంబం స్థలాన్ని ఆక్రమిస్తూ గ్రామస్తులపై దౌర్జన్యానికి పాల్పడుతోందని తెలిపారు. ఉన్నతాధికారులు గతంలో ఇచ్చిన సర్వే నివేదికను పరిశీలించి, స్థలాన్ని పరిరక్షించడంతో పాటు గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు, ఘర్షణలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ,మీనా,సుజాత,ఝాన్సీ, అఖిల,రంజిత్,రమేష్,చోదన్, తిరుపతి,రజిత,తిరుపతి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

భూముల ఠీ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్,సత్యదీపిక ఉదయం : జిల్లాలో చేపట్టిన భూముల ఠీ సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలోని 85 గ్రామాల్లో చేపట్టిన భూ సర్వే పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఠీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని, సంబంధిత రైతుల సమక్షంలోనే భూముల సర్వే చేపట్టి, హద్దులను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. సర్వే వివరాలను రైతులకు తెలియజేయడంతో పాటు, భూ రికార్డులను ఎలాంటి తప్పులకు తావులేకుండా స్పష్టంగా నిర్వహించాలని,ఠీ సర్వేలో నిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే స్పందించాలి.. నేరాల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు

రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా.. ఎన్ఫోర్స్మెంట్ చర్యలను ముమ్మరం చేయాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మొదటి పేజీ తరువాయి...

ప్రతి ఘటనపై తక్షణ స్పందన అవసరం

సీపీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటూ,నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.తమ పరిధిలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనపై ముందస్తు అవగాహనతో పాటు సమగ్ర సమాచారం కలిగి ఉండాలని అన్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే సమాచారంపై వెంటనే స్పందించాలని, సమస్య పెద్దదిగా మారిన తర్వాత వివరణ ఇచ్చే పరిస్థితి రాకుండా ముందస్తు అంచనా, సమన్వయం,తక్షణ స్పందన, సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ముందస్తు సమాచారం అందినప్పటికీ సమర్థవంతంగా స్పందించకపోవడం అధికారుల పనితీరు, పర్యవేక్షణపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఏదైనా సమస్యపై సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు స్వయంగా పర్యవేక్షించి, అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా

ప్రతి ఎస్హెచ్ఓ,సీఐ తమ పరిధిలోని శాంతిభద్రతలు, నేరాలు, సున్నితమైన



ప్రాంతాలు, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు, సమస్యాత్మక వ్యక్తులు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీపీ సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక పర్యవేక్షణ జాబితా నిర్వహిస్తూ,ఎవరిపై వ్యక్తిగతంగా శ్రద్ధ అవసరం,ఏ సమస్యలను కింది స్థాయి అధికారుల ద్వారా పరిష్కరించవచ్చు అనే అంశాలను నిరంతరం సమీక్షించాలన్నారు.రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను వారి రాజకీయ లేదా ఇతర అనుబంధాలతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా, నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రాపర్టీ సంబంధిత నేరాలు, శారీరక దాడులు, బెదిరింపులు,అక్రమ కార్యకలాపాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అవసరమైన చోట ఆకస్మిక తనిఖీలు, కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని తెలిపారు.

పర్యవేక్షణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

పర్యవేక్షణ అధికారులు కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా పగలు,రాత్రి వేళల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తమ పరిధిలోని వాస్తవ పరిస్థితులను స్వయంగా అంచనా వేయాలని సీపీ సూచించారు. ఎస్హెచ్ఓలకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తూ, పోలీస్ స్టేషన్ల రోజువారీ పనితీరు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల పరిస్థితి, ఎన్ఫోర్స్మెంట్ చర్యలను క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు.సమస్య తలెత్తిన తర్వాత బాధ్యత నుంచి తప్పించుకునే ధోరణి కాకుండా, సమస్యను ముందుగానే గుర్తించి పరిష్కరించే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని సీపీ స్పష్టం చేశారు.

పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం

పెండింగ్ కేసులను నిరంతరం సమీక్షిస్తూ, దర్యాప్తులో నాణ్యతను పెంచి, కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సీపీ ఆదేశించారు. నిందితుల అరెస్టు, సాక్ష్యాధారాల సేకరణ,సాంకేతిక ఆధారాల వినియోగం, చార్జిషీట్ల దాఖలు తదితర అంశాల్లో జాప్యం ఉండకూడదన్నారు. ప్రతి కేసులో దర్యాప్తు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, కోర్టులో నేర నిరూపణకు అవసరమైన పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు.

ఎన్ఫోర్స్మెంట్ కేసులపై ప్రత్యేక దృష్టి

ఈ-పెట్టీ కేసులు, ఎన్ఫోర్స్మెంట్ కేసుల నమోదు, పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ ఆదేశించారు. చిన్నపాటి ఉల్లంఘనలను కూడా నిర్లక్ష్యం చేయకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై సకాలంలో చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో చట్టంపై గౌరవం పెరగడంతో పాటు నేరస్థుల్లో భయం ఏర్పడుతుందని అన్నారు.డ్రంక్ అండ్ డ్రైవింగ్పై ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ,రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఎన్డీపీఎస్ కేసుల్లో సరఫరా నెట్వర్క్పై దర్యాప్తు ఎన్డీపీఎస్ కేసుల్లో తక్కువ పరిమాణంలో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలు పట్టుబడినా కేసు నమోదు చేసి,వాటి వెనుక ఉన్న సరఫరా వ్యవస్థ,ప్రధాన సరఫరాదారులు, మధ్యవర్తులు, వినియోగదారుల నెట్వర్క్ను లోతైన దర్యాప్తు చేపట్టాలని సీపీ ఆదేశించారు. నిందితులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నప్పటికీ వారి సంబంధాలను గుర్తించి,సంబంధిత రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రత్యేక బృందాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు

కమిషనరేట్ పరిధిలో అక్రమ రవాణా,గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, పేకాట,రేషన్ బియ్యం అక్రమ రవాణా,పశువుల అక్రమ రవాణా, ఇసుక అక్రమ రవాణా తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నిరంతరం ఎన్ఫోర్స్మెంట్ చర్యలు చేపట్టాలని సీపీ ఆదేశించారు.ప్రతి పోలీస్ అధికారి తన పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు, సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలకు అవకాశం ఉన్న ప్రదేశాలు,నేరస్థుల కదలికలు, అక్రమ కార్యకలాపాలపై ముందస్తు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు.

కేవలం క్షేత్రస్థాయిలో తిరగడం కాదు.. సమస్యను ముందుగానే గుర్తించాలి

పోలీస్ అధికారులు కేవలం క్షేత్రస్థాయిలో పర్యటించడం మాత్రమే తమ విధి కాదని,అక్కడి సమస్యలను ముందుగానే గుర్తించి,వాటికి పరిష్కారం చూపే ఆలోచనా విధానం, బాధ్యతాయుతమైన పనితీరు, సమర్థవంతమైన పర్యవేక్షణ ప్రతి అధికారిలో ఉండాలని సీపీ స్పష్టం చేశారు.

పోలీస్ వాహనాల పనితీరుపై సీపీ పరిశీలన.. వాహనాల్లో రైట్ గేర్ తప్పనిసరిగా ఉండాలి

- పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ వాహనాలను పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం పరిశీలించారు. వాహనాలను స్వయంగా తనిఖీ చేసి,వాటి ప్రస్తుత పరిస్థితి,పనితీరు, నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ విధుల్లో వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని, అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసే విధంగా ఎల్లప్పుడూ మంచి కండిషన్లో ఉంచాలని సీపీ సూచించారు. వాహనాల నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు.వాహనాల్లో ఏర్పాటు చేసిన సమాచార ప్రసార పరికరాలు, వైర్లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ పనితీరును కూడా సీపీ పరిశీలించారు. అత్యవసర సమయంలో అధికారులు, సిబ్బంది మధ్య సమాచార ప్రసారం వేగంగా జరిగేలా కమ్యూనికేషన్ పరికరాలు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ వాహనంలో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే అవసరమైన సామగ్రి తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని సీపీ ఆదేశించారు.ప్రతి వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె, మైక్ సిస్టమ్, అత్యవసర లైట్లు, తాళ్లు,ట్రాఫిక్ కోన్లు, నేరస్థల రక్షణ రిబ్బన్లు,హెల్మెట్లు, లాఠీలు,శరీర రక్షణ కవచాలు, ప్రతిఫలించే భద్రతా జాకెట్లు తదితర అత్యవసర,రక్షణ సామగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు.

అదేవిధంగా,ప్రతి వాహనంలో అవసరమైన రైట్ గేర్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వాహనాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ



వాహనాల నిర్వహణలో ఉన్న లోటుపాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి,వెంటనే సరిదిద్దాలని సీపీ సూచించారు.నిర్ణీత వ్యవధిలో వాహనాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, ఇంజిన్ ఆయిల్ మార్పు,టైర్ల పరిస్థితి, బ్రేకులు,లైట్లు, బ్యాటరీ,ఇతర యాంత్రిక పరికరాల పనితీరు వంటి అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించారు. వాహనాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని,చిన్న లోపం కూడా పెద్ద సమస్యగా మారకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని సూచించారు.

ఉత్తమంగా నిర్వహించే డ్రైవర్లకు ప్రోత్సాహకాలు

వాహనాలను ఎల్లప్పుడూ మంచి కండిషన్లో ఉంచుతూ,వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న డ్రైవర్లను గుర్తించాలని సీపీ తెలిపారు.వాహనాల నిర్వహణ, డ్రైవింగ్లో క్రమశిక్షణ,బాధ్యత, అప్రమత్తత,వాహన సంరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమంగా పనిచేస్తున్న ఐదుగురు డ్రైవర్లను గుర్తించి ప్రోత్సాహకంగా పురస్కారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

పోలీస్ వాహనాలు ఎల్లప్పుడూ అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా అధికారులు, డ్రైవర్ల సమన్వయంతో పనిచేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ సి.హెచ్.శ్రీనివాస్, టాస్క్ఫోర్స్, ఏసీపీ శ్రీనివాస్రావు,సైబర్ క్రైమ్ డిఎస్పీ రంగారెడ్డి,ఏఆర్ ఏసీపీ రమేష్ తో పాటు ఇతర సీఐలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.

డ్రగ్స్కు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ,కష్టపడి చదివే అలవాటును అలవరచుకోవాలి: పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి విద్యార్థులకు సూచించారు.గురువారం రామగిరి మండలం చందనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షణలో, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో డ్రగ్స్ దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత,చెడు అలవాట్లకు దూరంగా ఉండటం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి, ప్రవచనకర్త ఎస్పీ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ భూక్య రామ్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా వారి చదువు,వ్యక్తిత్వం, కుటుంబ పరిస్థితులు, భవిష్యత్తును కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు గురికాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచించే మంచి మార్గంలో నడవాలని సూచించారు.విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కష్టపడాలని అన్నారు. చదువు, క్రీడలు,సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడా పోటీలతో పాటు వివిధ రంగాల్లో రాణించాలంటే విద్యార్థి దశ నుంచే కష్టపడి సాధన చేయాల్సిన అవసరం ఉందన్నారు.జీవితంలోని తొలి 20 సంవత్సరాలను చదువు,జ్ఞానం, నైపుణ్యాల సాధనకు కేటాయించి కష్టపడి పనిచేస్తే భవిష్యత్తులో జీవితాన్ని ప్రశాంతంగా, సంతోషంగా గడిపే అవకాశం ఉంటుందని తెలిపారు.అదే విద్యార్థి దశలో నిర్లక్ష్యం వహించి చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తులో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీసీపీ సూచించారు. మత్తు పదార్థాలను ఎవరైనా వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా లేదా అక్రమంగా సరఫరా చేస్తున్నా వాటి గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులతో విద్యార్థులు నేరుగా ఘర్షణకు దిగకుండా, వెంటనే స్థానిక పోలీసులకు లేదా అత్యవసర సహాయ నంబర్ 112కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, పోలీసులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని భరోసా



ఇచ్చారు.రోడ్డు భద్రతపై మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి క్షేమంగా బయలుదేరి తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే రోడ్డు భద్రత కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని డీసీపీ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా తమ తండ్రులు, అన్నదమ్ములు, కుటుంబ సభ్యులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే కార్లు,ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించేలా కుటుంబ సభ్యులకు సూచించాలని కోరారు.అతి వేగం,నిర్లక్ష్యపు డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం,హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాలతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.తమ కుటుంబ సభ్యులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విద్యార్థులు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని డీసీపీ పిలుపునిచ్చారు. విద్యార్థులు మంచి నడవడిక, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనను అలవర్చుకుంటే దాని ప్రభావం కుటుంబం, పాఠశాల, సమాజంపై సానుకూలంగా ఉంటుందని తెలిపారు.ఈనాటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తు పౌరులని,దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన బాధ్యత వారిపై ఉందని డీసీపీ పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల సూచనలను పాటిస్తూ,చెడు స్నేహాలకు దూరంగా ఉండి, చదువు,తమ భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.డ్రగ్స్కునో చెప్పండి-రోడ్డు భద్రతా నియమాలను పాటించండి-క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించండి అని డీసీపీ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

క్యాతనపల్లి ఫ్లైఓవర్ వద్ద

వాహనాల తనిఖీల్లో

రామగుండం పోలీస్ కమిషనర్

మంచిర్యాల , నవంబర్ 12, సత్యదీపిక ఉదయం :

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని క్యాతనపల్లి ఫ్లైఓవర్ వద్ద గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,



ఐపీఎస్,స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారుల వాహనాలను తనిఖీ చేసి,రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్,డ్రైవింగ్ లైసెన్స్ తదితర వాహన సంబంధిత పత్రాలను పరిశీలించారు. వాహనదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వాహనదారులను సీపీ అభినందించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం,అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ,తమతో పాటు ఇతరుల భద్రతకు కూడా బాధ్యత వహించాలని సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా సీపీ వెంట శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వయోజన విద్యాశాఖ జిల్లా ఇన్‌చార్జిగా

ఏ. పురుషోత్తం బాధ్యతల స్వీకరణ

మంచిర్యాల,నవంబర్ 12, సత్యదీపిక ఉదయం :

మంచిర్యాల జిల్లా వయోజన విద్యాశాఖ జిల్లా ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన ఏ. పురుషోత్తం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ని మర్యాదపూర్వకంగా కలిసి తన నియామకం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఏ. పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలో వయోజన విద్యా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు ULLAS



-- నవ భారత్ సాక్షరత కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రజల్లో విద్య పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతానన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు ఏ. సత్యనారాయణమూర్తి, ఎం. సుమన్ తదితరులు పాల్గొని నూతన జిల్లా ఇన్‌చార్జి ఏ. పురుషోత్తంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థుల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి - నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలి - సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలి - ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ భూ ఆక్రమణలకు అవకాశం కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మొదటి పేజీ తరువాయి...

ఇంకా అందుబాటులోకి రాలేదని గుర్తించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే బెడ్స్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన పరుపులతో పాటు బెడ్స్‌ను కూడా త్వరగా ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు





ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని,వంటశాల, భోజనశాలను పరిశుభ్రంగా నిర్వహించాలని, అవసరమైన అన్ని వసతులు సమకూర్చుకోవాలని సూచించారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను నాయబ్ తహసిల్దార్ అంజయ్యతో కలిసి పరిశీలించి, సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రీ సర్వే సిబ్బంది ఉదయం వేళల్లోనే క్షేత్రస్థాయికి చేరుకొని పనులు ప్రారంభిస్తే ఎక్కువ భూమిని సర్వే చేయడానికి అవకాశం ఉంటుందని,తద్వారా పనులు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని తహసిల్దార్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ భూ ఆక్రమణలకు అవకాశం కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాపూర్ గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించడంపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించాలని, సెలవుల అనంతరం విద్యార్థులందరూ తిరిగి పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి మండలాల తహసిల్దార్లతో భూ రీ సర్వే, జి.ఓ. నంబర్ 59,76 అమలు,భూభారతి డిజిటల్ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, సర్వే పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలు,జి.ఓ.నంబర్76 క్రింద చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భూ రీ సర్వే పనులు వేగంగా పూర్తయ్యేలా తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, సర్వే సిబ్బంది ఉదయాన్నే గ్రామాలకు చేరుకొని పనులు ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేలా 'రైతుకు రక్షణ' లఘు చిత్రం రూపకల్పన

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, సత్యదీపిక ఉదయం :

సమాజంలో నెలకొన్న భూ వివాదాలు, వాటి కారణంగా కుటుంబాల మధ్య తలెత్తుతున్న సమస్యలపై సామాజిక దృక్పథంతో అవగాహన కల్పించేలా 'రైతుకు రక్షణ' లఘు చిత్రాన్ని రూపొందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు





కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, జైపూర్ మండల తహసిల్దార్ వనజారెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి 'రైతుకు రక్షణ' లఘు చిత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా భూములకు సంబంధించిన వివాదాలు కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో భూ సమస్యలపై ప్రజలలో అవగాహన కల్పించే ఉద్దేశంతో సామాజిక సందేశాత్మకంగా లఘు చిత్రాన్ని రూపొందించడం సంతోషకరమని తెలిపారు. సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్వహించిన భూ సర్వే ఆధారంగా రూపొందిన రెవెన్యూ రికార్డులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, దీనివల్ల వారసత్వంగా సంక్రమించిన భూముల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. భూ వివాదాలకు సంబంధించిన కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో న్యాయస్థానాలలో వాటి పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ పరస్పర అంగీకారంతో ఒకే నిర్ణయానికి వచ్చి భూముల పంపిణీ చేసుకుంటే వివాదాలను సులభంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. భూముల పంపిణీ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం లఘు చిత్ర దర్శకుడు నాగరాజు రూపొందించిన 'రైతుకు రక్షణ' లఘు చిత్ర గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు నాగరాజును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల, నవంబర్ 12, సత్యదీపిక ఉదయం :

వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని



నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల హెచ్ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలను ప్రతి పి.పి.సి.హెచ్ఓడి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పి సిఎస్ ఎపి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయడంతో పాటు, నిర్దేశించిన 16 ప్రశ్నలకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్,జిల్లా మేనేజర్ శ్రీకళ,డి.పి.ఎం.,మెప్మా పి.డి.,ఇన్చార్జి జిల్లా సహకార అధికారి, డి.సి.ఎం.ఎస్. మేనేజర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్య సాధనకు కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



- ఉద్యోగం సాధించడమే కాదు.. మెరిట్‌లో అగ్రస్థానం సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలి: రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు క్రమశిక్షణ,పట్టుదల, నిరంతర కృషితో తమ లక్ష్యాలను సాధించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,ఏసీపీ ప్రకాష్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,గత రెండు నెలలకు పైగా అభ్యర్థులు ఎంతో కష్టపడి శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షణలో పాల్గొంటున్న అభ్యర్థుల్లో అధిక శాతం మంది ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించే అవకాశం ఉందని పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన తరువాత అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసం, ప్రేరణ,లక్ష్యసాధన పట్ల నిబద్ధత మరింత పెరుగుతాయని తెలిపారు.

పరీక్ష పూర్తయ్యే వరకు ఇదే ఉత్సాహం, పట్టుదలతో చదువును కొనసాగించాలని సూచించారు. ప్రిలిమినరీ పరీక్ష అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అభ్యర్థులకు శారీరక దృఢత్వ పరీక్షలకు సంబంధించిన శిక్షణ కూడా అందిస్తామని తెలిపారు. ఫిజికల్ టెస్టులతో పాటు అవసరమైన ప్రాక్టీస్, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఒకే ఉద్యోగంపై ఆధారపడకుండా కానిస్టేబుల్,ఎస్ఐ ఉద్యోగాలతో పాటు తమ విద్యార్హతలను బట్టి బ్యాంకింగ్, రైల్వే,డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు కూడా సిద్ధం కావాలని సూచించారు. వివిధ పోటీ పరీక్షల్లోని సబ్జెక్టులు,పరీక్షా విధానాల్లో కొంత సారూప్యత ఉంటుందని,ప్రస్తుత శిక్షణ ద్వారా పొందుతున్న పరిజ్ఞానం ఇతర ఉద్యోగ పరీక్షలకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఉద్యోగం సాధించిన అనంతరం బాధ్యతాయుతంగా, పూర్తి నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సుమారు 400 మంది అభ్యర్థులు క్రమం తప్పకుండా హాజరవుతుండటం అభినందనీయమని అన్నారు. ఉద్యోగం సాధించడం మాత్రమే కాకుండా, ఈ శిక్షణ ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వం, సామాజిక బాధ్యత వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ లేదా ఇతర ఏ రంగంలో పనిచేసినా ఈ లక్షణాలు జీవితంలో విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, పోలీసులు 24 గంటలు,ఏడాది



పొడవునా ప్రజల భద్రత కోసం సేవలందిస్తారని తెలిపారు. వారి సేవాభావం, త్యాగనిరతి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు.

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ....,శిక్షణ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు అభ్యర్థుల ప్రవర్తన, వస్త్రధారణ, సమయపాలన, క్రమశిక్షణలో గణనీయమైన మార్పు కనిపిస్తోందని తెలిపారు. అభ్యర్థులను చూస్తుంటే ఇప్పటికే పోలీస్,ఆర్మీ నియామకాలకు సిద్ధమైన వారిలా కనిపిస్తున్నారని, వారి క్రమశిక్షణ, అంకితభావం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. కేవలం ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కాకుండా, మెరిట్ జాబితాలో అత్యుత్తమ స్థానం సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. కానిస్టేబుల్ ఉద్యోగం ఒక ప్రారంభం మాత్రమేనని, ఉద్యోగంలో చేరిన తరువాత తమ ప్రతిభ, కృషి, పనితీరుతో ఉన్నత పదవులను సాధించే అవకాశాలు ఉంటాయని వివరించారు. శిక్షణలో భాగంగా గణితం,రీజనింగ్, భాషా పరిజ్ఞానం వంటి అంశాల్లో అభ్యర్థులు పొందుతున్న పునాది ఇతర పోటీ పరీక్షలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తమపై తమకు నమ్మకం ఉంచుకోవాలని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమపై పెట్టుకున్న ఆశలు,నమ్మకాన్ని స్ఫూర్తిగా తీసుకుని లక్ష్య సాధన కోసం కష్టపడాలని సూచించారు. విజయం సాధించే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని తెలిపారు. అభ్యర్థులకు విద్యాబోధనతో పాటు మంచి వ్యక్తిత్వం, నడవడిక, క్రమశిక్షణను నేర్పిస్తున్న రిజర్వ్



ఇన్‌స్పెక్టర్ సంపత్, వారి బృంద సభ్యుల కృషి అభినందనీయమని అన్నారు. ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులు ఏ రంగంలోకి వెళ్లినా విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సంపత్,పోలీస్ అధికారులు,శిక్షణ బృంద సభ్యులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

